సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శనివారం, 26.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 326
పేజీలు: 08 వెల: రూ. 5




## ఫిరాయింపుల్లో తెలంగాణ

# టాప్-3

### మొదటి స్థానంలో నాగాలాండ్.. రెండో స్థానంలో బెంగాల్

- బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది ఎమ్మెల్యేల జంప్
- కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన గులాబీ ఎమ్మెల్యేలు
- దేశవ్యాప్తంగా 111 మంది ప్రజాప్రతినిధుల పార్టీ మార్పు
- 26 మంది లోక్‌సభ.. 7 మంది రాజ్యసభ సభ్యులు
- ఫిరాయింపుదారుల్లో 78 మంది ఎమ్మెల్యేలు
- 111 మందిలో 81 మంది మూడు పార్టీల్లోకే
- బీజేపీ నుంచి ఒక్క ఫిరాయింపు కూడా లేదు
- స్పీకర్‌కు బదులు గవర్నర్, రాష్ట్రపతికి అధికారాలు ఇవ్వాలన్న ఏడీఆర్



**ముద్ర, నేషనల్ బ్యూరో:** పార్టీ ఫిరాయింపుల విషయంలో తెలంగాణ మరోసారి దేశవ్యాప్తంగా చర్చలో నిలిచింది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు మారిన సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలంగాణకు మూడో స్థానం దక్కింది. మొదటి స్థానంలో నాగాలాండ్ ఉండగా.. రెండో స్థానంలో పశ్చిమ బెంగాల్ నిలిచాయి. 2022 నుంచి 2026 మధ్య ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు మారిన ప్రజాప్రతినిధుల వివరాలను ఏడీఆర్ విశ్లేషించింది.

**111 మంది పార్టీ మార్పు**

ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. దేశంలోని 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మొత్తం 4,876 మంది ప్రజాప్రతినిధుల వివరాలను పరిశీలించగా.. 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు మార్చినట్లు గుర్తించింది. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ మారిన 111 మందిలో 81 మంది కేవలం మూడు పార్టీల్లో చేరడం గమనార్హం.

**నాగాలాండ్ నంబర్ వన్**

పార్టీ ఫిరాయింపుల్లో నాగాలాండ్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలు మార్చినట్లు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్), బీజేపీ తదితర పార్టీల్లోకి ప్రజాప్రతినిధులు మారినట్లు నమోదైంది.

**బెంగాల్ సెకండ్**

నాగాలాండ్ తర్వాత పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రంలోనూ ఎన్నికల్లో గెలిచిన తర్వాత సిట్టింగ్ ప్రజాప్రతినిధులు పార్టీలు మారినట్లు ఏడీఆర్ విశ్లేషణలో తేలింది.

**తెలంగాణకు మూడో స్థానం**

తెలంగాణ విషయానికి వస్తే.. బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఏడీఆర్ నివేదికలో నమోదైంది. దీంతో పార్టీ ఫిరాయింపుల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి గతంలోనూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల మార్పులు నమోదైన విషయం తెలిసిందే. ఏడీఆర్ గత నివేదికల్లోనూ తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేల పార్టీ మార్పులను నమోదు చేసింది.

**బీజేపీ నుంచి ఒక్కరూ లేరు!**

ఈ నివేదికలో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. 2022–2026 మధ్య పార్టీలు మారిన 111 మంది సిట్టింగ్ మిగతా 02లో

## తెలుగు దిగ్గజాల

# దూకుడు..

### టాప్ 100లో ఏడుగురు మనోళ్లు

- రూ.4.01 లక్షల కోట్లకు పైగా కుటుంబ సంపద
- ఫార్మా నుంచి డేటా సెంటర్ల వరకు దూకుడు
- సంపన్నుల జాబితాలో హైదరాబాద్ సత్తా
- మురళి దివి సంపద రూ.1.25 లక్షల కోట్లు
- సంపన్నుల నగరాల్లో హైదరాబాద్‌కు నాలుగో స్థానం
- తెలుగు వ్యాపార కుటుంబాలకు హురున్ జాబితాలో చోటు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** దేశంలోని సంపన్నుల జాబితాలో హైదరాబాద్ మరోసారి తన ప్రత్యేక స్థానాన్ని చాటుకుంది. పరిశ్రమలు, ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్లు వంటి విభిన్న రంగాల్లో వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు వ్యాపార ప్రముఖులు దేశంలోని టాప్ 100 సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. హురున్ విడుదల చేసిన తాజా సంపద నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ ఏడుగురు వ్యాపారవేత్తలు, వారి కుటుంబాల వద్ద కలిపి ఉన్న సంపద విలువ రూ.4,01,200 కోట్లకు పైగా ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. ఒకే నగరానికి చెందిన వ్యాపార కుటుంబాలు ఇంత భారీ స్థాయిలో సంపదను కలిగి ఉండటం హైదరాబాద్ ఆర్థిక ప్రాధాన్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది.

**ఫార్మా నుంచి ఇన్‌ఫ్రా వరకు..**

ఈ జాబితాలో హైదరాబాద్ నుంచి అత్యధిక సంపద కలిగిన వారిలో దివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన మురళి ముందంజలో ఉన్నారు. మిగతా 02లో

## వరదలో కొట్టుకుపోయిన టీడీపీ ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు



02

- శ్రీకాకుళం జిల్లాలో కాపాడిన రెస్క్యూ టీమ్స్
- 9 నెలల గర్భిణీకి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షణ
- సాలూరులో జలదిగ్బంధం.. మంత్రి పరిశీలన

# వీడిన చిక్కుముడి!

### 22ఏ భూముల వివాదంలోని లక్షలాది ఇళ్లు, ప్లాట్లకు శాశ్వత విముక్తి

- సీఎం హామీ మేరకు ఉత్తర్వులు జారీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఏళ్లుగా మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ భూముల సమస్యకు తెలంగాణ ప్రభుత్వం పరిష్కారం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ నిషేధిత జాబితాలో కొనసాగుతున్న అర్హత కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లను ఆ జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుమారు 1.41 లక్షల ఆస్తులకు భారీ ఊరట లభించనుంది. ఈ నెల 16న శాసన సభలో సీఎం ఇచ్చిన హామీ మేరకు చర్యలు చేపట్టారు. గురువారం హైదరాబాద్‌లోని మిగతా 02లో

## సీఎంకు బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు

కేరళలో ఘన గౌరవం.. 02

- నిలంబూర్‌లో రేవంత్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం
- రైతులు, బీసీల సంక్షేమానికి గుర్తింపు
- రూ.లక్ష నగదు.. ప్రశంసాపత్రం, జ్ఞాపిక
- కేసీ వేణుగోపాల్ స్మారక ఉపన్యాసం



## కేసీఆర్‌కు నేడో రేపో నోటీసులు?

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై ఉత్కంఠ 02

- కాంపౌండ్ లోపల సర్వేపై ఉత్కంఠ..
- బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధం?



## పెట్టుబడులే లక్ష్యంగా లోకేశ్ పర్యటన

అహ్మదాబాద్ లో పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ 02

- ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై టోరెంట్‌తో చర్చలు
- వెల్‌స్పన్, గోకుల్ ఆగ్రోకు ఏపీ ప్రతిపాదనలు



## అరికెపూడికి ఈడీ షాక్

సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సమన్లు 02



- రూ. 2.1 కోట్ల నగదు లావాదేవీలపై ఈడీ నోటీసులు
- ఈ నెల 27న విచారణకు హాజరు కావాలన్న ఈడీ అధికారులు
- పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు

## బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

యూపీలో బ్రహ్మోస్ తయారీ.. పాక్‌కు టెన్షన్ 02

- బ్రహ్మోస్ దెబ్బతో పాక్ కాళ్లబేరానికి వచ్చింది.
- ఏకే-203తో ఉగ్రవాదులకు చెక్
- యూపీ నుంచి శత్రువులకు షాక్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా




ఇదీAI
ముద్ర



## నేరేడు గింజలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలం



నేరేడు గింజల్లో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించడంలో సహాయపడవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.

# బై-బై గణేషా..

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగిన వినాయక నిమజ్జన మహోత్సవాలు పతాక స్థాయికి చేరాయి. నగరవాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన ప్రసిద్ధ ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి నిమజ్జన ప్రక్రియ ట్యాంక్ బండ్‌పై ఉన్న క్రేన్ నెం.4 వద్ద ప్రశాంతంగా ముగిసింది. భక్తుల జయధ్వానాలు, 'గణపతి బప్పా మోరియా' నినాదాల నడుమ మహాగణపతికి అశేష భక్తజనం భావోద్వేగంతో వీడ్కోలు పలికారు.



కాగా, ఉదయం క్రేన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా శోభాయాత్ర ప్రారంభం కావడంలో కొంత జాప్యం జరిగినప్పటికీ, అధికారుల సమన్వయంతో నిర్ణీత సమయానికి టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్ మీదుగా హుస్సేన్‌సాగర్ వద్దకు మహా గణపతి విగ్రహం చేరుకుంది. బడా గణేషుడిని కడసారి కళ్లారా చూసేందుకు, నిమజ్జన వేడుకలో భాగం అయ్యేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో హుస్సేన్‌సాగర్ తీరం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల సమన్వయంతో పకడ్బందీ భద్రత మధ్య నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు. నగర వ్యాప్తంగా సాగిన వినాయక నిమజ్జన శోభాయాత్ర ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర**

**హైదరాబాద్:** నగరంలోని బాలాపూర్‌లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి సొంతమైంది. రూ.39లక్షలకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది. వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కి ప్రత్యేక స్థానంఉంది. స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపు సాధించింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందుకే వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.

# తెలుగు దిగ్గజాల దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అంచనా సంపద రూ.1,25,400 కోట్లుగా నమోదైంది. దేశీయ ఫార్మా రంగంలో దివీస్ ల్యాబొరేటరీస్ విస్తరణ ఆయన సంపద పెరుగుదలలో కీలక పాత్ర పోషించింది. ఆ తర్వాత మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్)కు చెందిన పి. పిచ్చిరెడ్డి రూ.53,100 కోట్ల సంపదతో, పి.వి. కృష్ణారెడ్డి రూ.52,100 కోట్ల సంపదతో జాబితాలో నిలిచారు. దేశవ్యాప్తంగా భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో మేఘా విస్తరించడంతో ఈ కుటుంబ వ్యాపార సామ్రాజ్యం గణనీయంగా పెరిగింది.

**టెక్నాలజీ, ఫార్మా రంగాలకూ స్థానం**

హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ వ్యవస్థాపకుడు శ్రీధర్ పిన్నపురెడ్డి, కుటుంబం రూ.46,100 కోట్ల సంపదతో జాబితాలో ఉన్నారు. డిజిటల్ మౌలిక వసతులు, క్లౌడ్, డేటా సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్ ఈ రంగానికి ప్రాధాన్యాన్ని పెంచుతోంది. ఇక ఫార్మా రంగం నుంచి ఆరోబిందో ఫార్మాకు చెందిన పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి రూ. 39,900 కోట్ల సంపదతో, హెటెరో గ్రూప్‌కు చెందిన బి. పార్థసారథి రెడ్డి కుటుంబం రూ. 39,400 కోట్ల సంపదతో టాప్ 100లో చోటు సంపాదించారు.



**హైదరాబాద్ నాలుగో స్థానంలో..**

వ్యక్తిగత సంపదతో పాటు నగరాల వారీగా చూస్తే కూడా హైదరాబాద్ సత్తా చాటింది. దేశంలో అత్యధిక సంఖ్యలో సంపన్నులు ఉన్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. ముంబై, న్యూఢిల్లీ, బెంగళూరు తర్వాతి స్థానాన్ని హైదరాబాద్ దక్కించుకుంది. ఈ జాబితాలో దేశవ్యాప్తంగా గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీ వంటి పారిశ్రామిక దిగ్గజాలు అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. అయితే హైదరాబాద్ నుంచి ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నాలజీ రంగాలకు చెందిన వ్యాపార కుటుంబాలు ఒకేసారి టాప్ 100లో కనిపించడం నగర వ్యాపార పరిణామానికి మరో సంకేతంగా నిలుస్తోంది. హైదరాబాద్ కేవలం ఐటీ, స్టార్టప్ హబ్‌గానే కాకుండా ఫార్మా, ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు వంటి రంగాల్లో భారీ వ్యాపార సామ్రాజ్యాలను సృష్టిస్తున్న నగరంగా ఎదుగుతున్నట్లు ఈ జాబితా సూచిస్తోంది.

# వీడిన చిక్కుముడి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, వివేక్ తదితరులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

**300 కాలనీలకు ఊరట**

హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో సుమారు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు ఈ నిర్ణయంతో ప్రయోజనం కలగనుంది. రంగారెడ్డి జిల్లాలో 44, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 65 కాలనీలు ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, గతంలో కొన్ని నివాస ప్రాంతాలు పొరపాటున 22ఏ జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

**అర్హత ఉంటే రిజిస్ట్రేషన్‌కు అవకాశం**

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ తదితర స్థానిక సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఖాళీ స్థలాలు, ఇళ్లు, ఫ్లాట్లను 22ఏ జాబితా నుంచి తొలగించనున్నారు. ఇందుకోసం చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన లేదా అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతి పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత రిజిస్ట్రేషన్‌కు లింక్ డాక్యుమెంట్‌ను చూపించాలి.

**ప్రత్యేక కమిటీలు.. పెండింగ్ కేసులు యథాతథం**

ప్రత్యేక సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటికే కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలు మాత్రం ఆయా న్యాయస్థానాల తుది తీర్పులకు లోబడి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కారం: పొంగులేటి**

దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న 22ఏ భూముల సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.



## సీఎంకు 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

**ముద్ర, హైదరాబాద్ :** కేరళలోని నిలంబూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ – 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఘనంగా అందుకున్నారు. కేరళ కాంగ్రెస్ దిగ్గజ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డికి ఫౌండేషన్ ప్రతినిధులు , ఏఐసీసీ ముఖ్య నేతలు సస్కారపూర్వకంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం , జ్ఞాపికను ముఖ్యమంత్రికి అందజేశారు.

**ప్రజా సంక్షేమ పాలనకు దక్కిన గౌరవం**

తెలంగాణ రాష్ట్రంలో రైతులు, వెనుకబడిన వర్గాలు (బీసీలు) , సామాన్య ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన వినూత్న పథకాలు, ఆయన కనబరుస్తున్న దూరదృష్టి గల పరిపాలనా వైఖరికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను, సమర్థవంతమైన నాయకత్వాన్ని అవార్డు ఎంపిక జ్యూరీ సభ్యులైన ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ మంత్రి ఏపీ అనిల్‌కుమార్ , ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ ప్రత్యేకంగా కొనియాడారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ కీలక నేతలు**

దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రదానోత్సవ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై స్మారక ఉపన్యాసం చేశారు. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు మంత్రిగా సేవలు అందించి కేరళ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆర్యదాన్ ముహమ్మద్ పేరిట నెలకొల్పిన తొలి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి స్వీకరించడం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, నేతలు అభినందనలు తెలిపారు.

## ఫిరాయింపుల్లో తెలంగాణ టాప్-3

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు, ఎమ్మెల్యేల జాబితాలో బీజేపీ నుంచి పార్టీ మారిన ప్రజాప్రతినిధులు ఒక్కరు కూడా లేరని ఏడీఆర్ విశ్లేషణ పేర్కొంది. అదే సమయంలో ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల్లోకి వెళ్లినట్లు నివేదిక తెలిపింది.

**అధికారాలు మార్చాలన్న ఏడీఆర్**

పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు ఏడీఆర్ పలు సంస్కరణలను సూచించింది. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేసే అధికారాన్ని స్పీకర్‌కు కాకుండా రాష్ట్రపతి, రాష్ట్రాల్లో గవర్నర్‌కు అప్పగించాలని సూచించింది. ఈ ప్రక్రియ ఎన్నికల సంఘం సలహా మేరకు జరగాలని పేర్కొంది. అంతేకాదు.. పార్టీ ఫిరాయించిన లేదా పార్టీకి రాజీనామా చేసిన ప్రజాప్రతినిధులు తదుపరి ఎన్నికల వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు తీసుకురావాలని ఏడీఆర్ సూచించింది. అలాగే ఫిరాయింపుల అనంతరం ప్రభుత్వ, రాజకీయ పదవులు చేపట్టకుండా చట్టపరమైన పరిమితులు విధించాలని కోరింది.

**చట్టం మారుతుందా?**

పార్టీ ఫిరాయింపులపై దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచో చర్చ జరుగుతున్నా.. అధికార, ప్రతిపక్ష పార్టీల రాజకీయ ప్రయోజనాలు ఈ అంశంతో ముడిపడి ఉంటాయి. ఇప్పుడు ఏడీఆర్ చేసిన తాజా సూచనలపై కేంద్రం, రాష్ట్రాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. ఫిరాయింపులను అడ్డుకునేలా కఠిన నిబంధనలు వస్తాయా? లేక రాజకీయ అవసరాల ముందు ఈ సూచనలు కూడా చర్చలకే పరిమితమవుతాయా? అన్నది చూడాలి.

## వరదలో కొట్టుకుపోయిన టీడీపీ ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

**ముద్ర, శ్రీకాకుళం :** ఉత్తరాంధ్రపై వాయుగుండం ప్రభావం కొనసాగుతోంది. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై.. ఆకస్మిక వరదలు సంభవించాయి. వాగులు, వంకలు పొంగుపొర్లుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ



ఎమ్మెల్యే కూన రవికుమార్.. అకస్మాత్తుగా వరదలో కొట్టుకుపోయారు. ఆయనతో పాటు వెళ్లిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోతుండగా.. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ టీమ్స్ అప్రమత్తయ్యాయి. మరో బోటులో వెళ్లి వారిని రక్షించాయి.

ఆకస్మిక వరదలు ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. పార్వతీపురంలో వరదల్లో 9 నెలల గర్భిణీ చిక్కుకుంది. గర్భిణీ భూమికను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. ఆమెకు లైఫ్ జాకెట్ ఇచ్చి.. ఒడ్డుకు చేర్చాక అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. జిల్లాలోని సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ జలదిగ్బంధంలో ఉండగా.. మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాలూరులో రోడ్లు, చెరువులు, పంటలు, ఇళ్ల పరిస్థితిపై ఆమె ఆరా తీశారు.

## పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ పర్యటన

**ముద్ర, ముంబై :** గుజరాత్‌లోని అహ్మదాబాద్ పర్యటనలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. టోరెంట్ గ్రూప్ ఛైర్మన్ సమీర్ మెహతా, వెల్‌స్పన్ గ్రూప్ సీఈవో నితిన్ జైన్, గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ ఛైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో ఆయన భేటీ అయ్యారు. టోరెంట్ గ్రూప్‌ను ఏపీలో క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు చేపట్టాలని లోకేశ్ కోరారు. రాష్ట్రంలో 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని వివరించారు. ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సమీర్ మెహతా తెలిపారు. వెల్‌స్పన్ సీఈవో నితిన్ జైన్‌తో సమావేశంలో విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్, కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డీఐ పైపుల తయారీ, పైపు కోటింగ్, గ్రీన్ అమోనియా యూనిట్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం కర్నూలు, కడపలో 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తున్నామని నితిన్ జైన్ తెలిపారు. గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ ఛైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో భేటీలో నెల్లూరులో పామాయిల్, సోయాబీన్ రిఫైనరీలు ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. కృష్ణపట్నంలో రోజుకు 1,400 టన్నుల సామర్థ్యంతో వంటనూనె రిఫైనరీని 2024లో ప్రారంభించామని ఠక్కర్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

## కేసీఆర్‌కు నేడో రేపో నోటీసులు?



**ముద్ర, హైదరాబాద్ :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. ఫామ్‌హౌస్ భూములకు సంబంధించి భూ క్రమబద్ధీకరణలు, 22-ఏ నిబంధనలు, అసైన్డ్, ప్రభుత్వ భూముల అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణను వేగవంతం చేసింది. ఇందుకోసం ఉన్నతస్థాయి అధికారులతో ఇప్పటికే విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం రెవెన్యూ, సర్వే అధికారులు ఫామ్‌హౌస్ వెలుపలి ప్రాంతాల్లో భూముల సరిహద్దులు, సర్వే నంబర్లను పరిశీలిస్తున్నారు. అయితే అసలు ఆరోపణలు కాంపౌండ్ లోపల ఉన్న భూములపైనే ఉండటంతో.. అక్కడ కూడా భౌతిక సర్వే నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంపౌండ్‌లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు, నాలాలు, వాగులు, నీటి వనరులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు వివరాలు సేకరించనున్నట్లు సమాచారం.

**నోటీసులు జారీ చేసే అవకాశం**

కాంపౌండ్ లోపల అధికారిక సర్వే చేపట్టాలంటే నిబంధనల ప్రకారం భూయజమానికి ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉండటంతో.. కేసీఆర్‌కు నేడో రేపో రెవెన్యూ శాఖ నుంచి నోటీసులు జారీ కావచ్చనే ప్రచారం సాగుతోంది. నోటీసులు అందిన తర్వాత కేసీఆర్ అధికారులకు సహకరిస్తారా? లేక న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా? అన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతోనే ఈ వ్యవహారాన్ని తెరపైకి తెస్తోందని బీఆర్ఎస్ ఆరోపించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. నోటీసులు జారీ అయితే హైకోర్టును ఆశ్రయించే అంశంపై బీఆర్ఎస్ న్యాయ బృందం కూడా కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

**తదుపరి అడుగు ఏంటి?**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ మాజీ మంత్రులు, కీలక నేతలకు సంబంధించిన ఫామ్‌హౌస్‌లు, భూముల వివరాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. నిబంధనల ఉల్లంఘనలు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దీంతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ గేట్లు అధికారుల సర్వే కోసం తెరుచుకుంటాయా? లేక ఈ వ్యవహారం కోర్టు వరకు వెళ్తుందా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అరికెపూడి గాంధీకి ఈడీ షాక్

**ముద్ర, హైదరాబాద్:** సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ దర్యాప్తులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రూ.2.1 కోట్ల నగదు లావాదేవీలపై వివరణ తీసుకునేందుకు ఈ నెల 27న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఈడీ అధికారులు పేర్కొన్నారు. సాహితీ ఇన్‌ఫ్రా ఖాతాల నుంచి గాంధీకి సుమారు రూ. 2.1 కోట్ల మేర బదిలీ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. తెలంగాణ పోలీసుల ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థపై ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి, వాటిని దారి మళ్లించారనే ఆరోపణలపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. ఈ కేసులో సంస్థకు, సంబంధిత వ్యక్తులకు చెందిన ఆస్తులపై గతంలో ఈడీ చర్యలు తీసుకుంది. రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణను 2024లో అరెస్ట్ చేశారు.

## బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

**ముద్ర, ఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.



ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## నేరేడు గింజలతో ఇన్సులిన్‌పై ప్రభావం

నేరేడు గింజలపై జరిగిన కొన్ని అధ్యయనాల్లో రక్తంలో గ్లూకోజ్, ఇన్సులిన్ సంబంధిత సూచికలపై ప్రయోజనకరమైన ప్రభావాలు కనిపించాయి. అయితే మనుషుల్లో దీనిపై మరింత పరిశోధన అవసరం.



## ఖరీదైన వినాయక లడ్డూలు.. రికార్డ్ ధరలు ఇవే!

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో గణేష్ నవరాత్రులంటే ఉత్సవాల సందడి మాత్రమే కాదు.. వినాయక లడ్డూ వేలంపాటలపై కూడా ఆసక్తి ఉంటుంది. ఈ ఏడాది వరకు నమోదైన ఖరీదైన లడ్డూ వేలం ధరల్లో కోహినూర్, హైటెక్ సిటీ ₹30,50,001తో టాప్‌లో ఉంది. ఆ తర్వాత మై హోమ్ భూజా ₹25 లక్షలు, మై హోమ్ మంగళ ₹21,11,116తో ఉన్నాయి.



బాలాపూర్ లడ్డూ : 39 లక్షలు
కోహినూర్ – ₹30,50,001
మై హోమ్ భూజా – ₹25,00,000
మై హోమ్ మంగళ – ₹21,11,116
నెల్లూరు లబోదర – ₹13,50,000
ఇండిస్ వివా సిటీ – ₹13,00,000
ప్రగతి నగర్ – ₹13,00,000
కూకట్‌పల్లి – ₹10 లక్షలకు పైగా
ఫ్రంట్‌లైన్ సెవెన్ – ₹8 లక్షలకు పైగా
మై హోమ్ అవతార్ – ₹8 లక్షలకు పైగా

## అక్టోబర్ 25 నుంచి తెలంగాణలో 'హ్యామ్' రోడ్లు

**సీతక్క కీలక ప్రకటన..**



**ముద్ర, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే పలు కీలక ప్రాజెక్టులు, ఉపాధి కల్పన , మౌలిక వసతుల కల్పనపై వివరాలు వెల్లడించారు.

**అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రోడ్లు.. ఉపాధి కూలీలకు ₹8,000 కోట్లు**

రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) పద్ధతిలో చేపట్టబోతున్న రోడ్ల నిర్మాణ పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి గారు ఈ హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. వీటితో పాటు ఎల్నినో ప్రభావం , వ్యవసాయ పరిస్థితులపై పూర్తిస్థాయిలో చర్చించామని పేర్కొన్నారు. రైతులకు వారు వేయాల్సిన పంటలపై ముందస్తుగానే అవగాహన కల్పించామని, 'రాంజీ' పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు ఏకంగా ₹8,000 కోట్ల విలువైన పనులు కల్పించబోతున్నామని స్పష్టం చేశారు.

**గుత్తి కోయ గూడాలకు తాగునీరు.. దివ్యా దేవరాజన్ నేతృత్వంలో కమిటీ**

ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రజలకు సరిపడా తాగునీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. అధికారి దాన కిషోర్ ఇచ్చిన సలహా మేరకు, ఈ ఉమ్మడి జిల్లాల పరిధిలోని దూరప్రాంత గుత్తి కోయ గూడాలకు సురక్షిత తాగునీరు ఎలా అందించాలనే అంశంపై ప్రత్యేక నివేదిక కోసం ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీతక్క ప్రకటించారు.

**ప్రతి గ్రామానికి ₹50 లక్షలు.. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు**

గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూ. 67,000 కోట్లు వెచ్చిస్తోందని, అందులో భాగంగా 553 మండలాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 'రాంజీ' పథకం ద్వారా ప్రతి గ్రామానికి ₹50 లక్షల రూపాయలను అందించబోతున్నామని, ఈ నిధులతో గ్రామంలో ఏ పనులు చేపట్టాలనేది ఆ గ్రామ ప్రజలే స్వయంగా నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్పంచ్‌ల ద్వారా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల పోస్టర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఇలాంటి సమీక్షా సమావేశాన్నే రేపు రంగారెడ్డి జిల్లాలోనూ నిర్వహించనున్నట్లు మంత్రి సీతక్క ముగించారు.

## నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

**మంత్రి పొన్నం**



**ముద్ర, హైదరాబాద్:** గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు. హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.

## హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు

**ముద్ర, హైదరాబాద్:** స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫుడ్ డెలివరీ సేవల విభాగంలో అడుగుపెట్టిన రాపిడో .. తన 'ఓన్లీ' సేవలను హైదరాబాద్‌కూ విస్తరించింది. ఇప్పటివరకు కేవలం బెంగళూరుకు మాత్రమే పరిమితమైన ఈ సేవల్ని భాగ్యనగరంలోనూ అందుబాటులోకి తెచ్చింది. రాపిడో యాప్‌తో పాటు ఓన్లీని ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు.

ఇతర ప్లాట్‌ఫామ్‌ల మాదిరిగా కాకుండా.. ఓన్లీ జీరో కమీషన్ మోడల్‌ను అనుసరిస్తోంది. ప్రతిగా రెస్టరంట్ల నుంచి సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తోంది. ప్రస్తుతం 22 వేల రెస్టరంట్లతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఓన్లీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇప్పటివరకు 42 లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపింది. ప్యాకేజింగ్ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు, సర్జ్ ఛార్జీలు వంటివేవీ తమ ప్లాట్‌ఫామ్‌పై ఉండవని చెబుతోంది.జీరో కమీషన్ మోడల్ వల్ల రెస్టరంట్లు విక్రయించిన మొత్తం వారికే చెందుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్లాట్‌ఫామ్‌కు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సి అవసరం లేదని తెలిపింది.

# దేశ రక్షణలో బీఎస్ఎఫ్ దే అగ్రభాగం

**నక్సలైట్లు, దేశ వ్యతిరేకశక్తుల పీచమణచడంతో కీలక పాత్ర**
**జవాన్లకు మౌలిక సౌకర్యాలు కల్పన మోదీ ప్రభుత్వ సంకల్పం**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి**
**చెన్నై బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ లో నూతన భవనాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి**




**ముద్ర, హైదరాబాద్ :** దేశ రక్షణలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అగ్రభాగాన నిలుస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తుల పీచమణచడంలో బీఎస్ఎఫ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బీఎస్ఎఫ్ సిబ్బంది రక్షణ కవచంలా నిలవడంవల్లే మల్కాన్‌గిరి ప్రాంతం శాంతి, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందనన్నారు. ఈరోజు చెన్నైలోని బీఎస్ఎఫ్ సెక్టార్ హెడ్‌క్వార్టర్స్ లో నూతనంగా నిర్మించిన పరిపాలనా, నివాస సౌకర్యాల భవనాలను ప్రారంభించారు. రూ.11.07 కోట్లతో నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ను, రూ. 4.74 కోట్ల వ్యయంతో నిర్మించిన గెటిజెట్ ఆఫీసనర్స్ భవనాన్ని. రూ.9.86 కోట్ల వ్యయంతో నిర్మించిన సిబ్బంది బ్యారక్‌ను, రూ.5.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సబార్డినేట్ అధికారుల భవనాన్ని ప్రారంభించారు. బీఎస్ఎఫ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ (ADG), సెవాంగ్ నాంగ్యాల్, ప్రత్యేక డైరెక్టర్ జనరల్(CPWD) ఇంజనీర్ వివేక్ నంద్ వివేక్, చీఫ్ ఇంజనీర్ (దక్షిణ ప్రాంతం), CPWD, చెన్నై ఎ. శ్రీనివాస రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఫ్రంటియర్ హెడ్‌క్వార్టర్స్,(ఒడిశా) సి.హెచ్. సేతురామ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, సెక్టర్ హెడ్‌క్వార్టర్స్, ( చెన్నై) విజయ్ సిన్హా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (CPWD చెన్నై) జి.ఎస్. రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవాన్లను ఉద్దేశంచి కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యంశాలు...

ఈ రోజు చెన్నైలోని BSF హెడ్ క్వార్టర్స్ లో పరిపాలనా భవనం, అధికారులు నివాసాలు, కింది స్థాయి అధికారుల నివాసాలు, వీర జవాన్ల కోసం నిర్మించిన నూతన నివాస సముదాయాలను ప్రారంభించిడం సంతోషంగా ఉంది. 2014లో బీఎస్ఎఫ్ చెన్నై–మల్కాన్‌గిరి సెక్టర్ ఏర్పడినప్పటి నుంచి నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా మన రక్షణ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగంగా పని చేస్తోంది. ఈ సెక్టర్ సిబ్బంది చూపిస్తున్న ధైర్యం, అప్రమత్తత మరియు అంకితభావం BSF నినాదమైన "జీవితాంతం కర్తవ్యం" అనే మాటలకు నిజమైన అర్థాన్ని చూపిస్తున్నాయి. ఈ రోజు మల్కాన్‌గిరి శాంతి, అభివృద్ధికి కొత్త యుగంలోకి అడుగుపెట్టింది. మౌలిక సదుపాయాల రంగంలో కూడా అక్కడ నిరంతర అభివృద్ధి జరుగుతోంది. ఇది మీలాంటి వీర జవాన్లు ఒక అభేద్యమైన రక్షణ గోడలా నిలబడి దేశాన్ని కాపాడటం వల్లే సాధ్యమైంది.

దేశానికి రక్షణ కల్పించడంలో బీఎస్ఎఫ్ అగ్రభాగాన నిలిచింది. దేశ సరిహద్దులను రాత్రింబవళ్లు కాపాడేందుకు BSF సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. దేశాన్ని కాపాడే మన జవాన్లు కూడా సురక్షితంగా ఉండేందుకు వారికి అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పం.

ఈరోజు ప్రారంభించిన ఈ ఆధునిక బ్యారక్ కేవలం ఒక భవనం మాత్రమే కాదు. ప్రతికూల పరిస్థితుల్లో, మైనస్ ఉష్ణోగ్రతల్లో, ఎన్నో సవాళ్ల మధ్య కూడా దేశ సరిహద్దులను కాపాడుతున్న వీర సిబ్బంది, జవాన్ల పట్ల మన గౌరవానికి ఇది ఒక ప్రతీక. ఈ కొత్త ప్రాంగణంలో జవాన్లకు విశ్రాంతి, పరిశుభ్రత, రోజువారీ అవసరాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాం. డ్యూటీ పూర్తయిన తర్వాత మన జవాన్లకు మానసికంగా, శారీరకంగా విశ్రాంతి తీసుకుని మళ్లీ ఉత్సాహంగా, అంకితభావంతో మరియు ఉన్నతమైన మనోధైర్యంతో విధులు నిర్వహించేలా మంచి వాతావరణాన్ని కల్పించడం మన లక్ష్యం. దక్షిణ భారతదేశంలో విధులు నిర్వహిస్తున్న BSF సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, భవిష్యత్తులో చెన్నై సెక్టర్ ద్వారా వివిధ సంక్షేమ సౌకర్యాలు, పరిపాలనా సహాయం, వైద్య సేవలు మరియు విద్యా సౌకర్యాలను పొందగలరు. అందరం కలిసి బలమైన, సురక్షితమైన అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉద్ధృతంగా బొగత జలపాతం

**ముద్ర, వరంగల్ :** ములుగు జిల్లా వాజేడు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొగత జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాల నేపథ్యంలో ఈత కొలనులోకి ప్రవేశాన్ని అధికారులు నిషేధించారు. సందర్శనకు మాత్రమే అనుమతినిచ్చారు.



## గోదావరి వరద నీటిని రిజర్వాయర్లకు మళ్లించాలి

**ముద్ర, హైదరాబాద్ :** గోదావరిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ రిజర్వాయర్లను నింపేందుకు ప్రభుత్వం మోటార్లు నడపడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఎల్‌నినోను కారణంగా చూపి నీటి నిర్వహణ బాధ్యత నుంచి తప్పించుకోవద్దని ఆయన సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లను గోదావరి వరద జలాలతో నింపితే రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రస్తుతం అన్నపూర్ణ, రంగనాయక సాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉండగా.. మల్లన్న సాగర్‌లో 13 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో సుమారు 6 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. దీనివల్ల సాగునీటితో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు.



సిద్దిపేట జిల్లా నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీకి రంగనాయక సాగర్ నుంచి నీటిని అందించే ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో ఫ్యాక్టరీ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. పామాయిల్ రైతులు కూడా ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

గోదావరిలో వరద ప్రవాహం ఉన్న సమయంలోనే అన్ని మోటార్లను 24 గంటల పాటు నడిపి జలాశయాలను నింపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతుల ప్రయోజనాల కోసం అందుబాటులో ఉన్న వరద జలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నేతాజీ నగర్ లో వైభవంగా శోభాయాత్ర



**లక్షా రెండు వేలు పలికిన లడ్డూ ధర**

**ముద్ర న్యూస్ బ్యూరో , హైదరాబాద్:** మెహిదీపట్నం సమీపంలోని నేతాజీ నగర్ కాలనీలో శుక్రవారం గణేష్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. కాలనీలో ప్రతిష్ఠించిన మట్టి గణపతిని అన్ని వీధుల్లో ఊరేగించిన తర్వాత శ్రీ ఉమామహేశ్వర సీతారామ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాశివుని విగ్రహ సన్నిధిలో నిమజ్జనం చేశారు. గణేష్ మండపంలో వినాయకునికి ప్రసాదంగా సమర్పించిన ఐదు కిలోల లడ్డు ధర వేలంలో లక్షా రెండు వేల రూపాయలు పలికింది. పోటా పోటీగా జరిగిన వేలంలో కాలనీకి చెందిన వ్యాపారవేత్త టీ విశాల్ లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడి చేతిలో పూజలు అందుకున్న మరో మూడు కిలోల లడ్డూను వేలంపాటలో 60 వేల రూపాయలకు కాలనీకి చెందిన ఫ్లవర్ మర్చంట్ నరేందర్ రెడ్డి దక్కించుకున్నారు. నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నేతాజీ నగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రల కాలనీకి చెందిన వందలాదిమంది పాల్గొన్నారు.

జి అప్పారావు, టీఎస్ ఆనందరెడ్డి, ఎం.వి రంగారెడ్డి, ఏ కృష్ణమూర్తి, అమర్నాథ్ రెడ్డి, రవితేజ, శ్రీనివాస్, టీ విశాల్ తదితరులు శోభాయాత్రకు నాయకత్వం వహించారు.

బద్రీనాథ్, వేదవ్రత్, దేవాక్షిత్, చరణ్, సదానంద్, సాగర్ తదితరుల యువజన బృందం ఉత్సాహంగా నృత్యాలు చేశారు.





ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర, నిమజ్జనం

## హైదరాబాద్ ధనికుల

# దూకుడు

### టాప్ 100లో ఏడుగురు తెలుగు వ్యాపార దిగ్గజాలు






దేశంలోని సంపన్నుల జాబితాలో హైదరాబాద్ మరోసారి తన ప్రత్యేక స్థానాన్ని చాటుకుంది. పరిశ్రమలు, ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్లు వంటి విభిన్న రంగాల్లో వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు వ్యాపార ప్రముఖులు దేశంలోని టాప్ 100 సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. హురున్ విడుదల చేసిన తాజా సంపద నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ ఏడుగురు వ్యాపారవేత్తలు, వారి కుటుంబాల వద్ద కలిపి ఉన్న సంపద విలువ రూ.4,01,200 కోట్లకు పైగా ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. ఒకే నగరానికి చెందిన వ్యాపార కుటుంబాలు ఇంత భారీ స్థాయిలో సంపదను కలిగి ఉండటం హైదరాబాద్ ఆర్థిక ప్రాధాన్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది.

**ఫార్మా నుంచి ఇన్‌ఫ్రా వరకు..**

ఈ జాబితాలో హైదరాబాద్ నుంచి అత్యధిక సంపద కలిగిన వారిలో దివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన మురళి ముందంజలో ఉన్నారు. ఆయన అంచనా సంపద రూ.1,25,400 కోట్లుగా నమోదైంది. దేశీయ ఫార్మా రంగంలో దివీస్ ల్యాబొరేటరీస్ విస్తరణ ఆయన సంపద పెరుగుదలలో కీలక పాత్ర పోషించింది. ఆ తర్వాత మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) కు చెందిన పి. పిచ్చిరెడ్డి రూ.53,100 కోట్ల సంపదతో, పి.వి. కృష్ణారెడ్డి రూ.52,100 కోట్ల సంపదతో జాబితాలో నిలిచారు. దేశవ్యాప్తంగా భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో మేఘా విస్తరించడంతో ఈ కుటుంబ వ్యాపార సామ్రాజ్యం గణనీయంగా పెరిగింది.

**టెక్నాలజీ, ఫార్మా రంగాలకూ స్థానం**

హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ వ్యవస్థాపకుడు శ్రీధర్ పిన్నపురెడ్డి, కుటుంబం రూ.46,100 కోట్ల సంపదతో జాబితాలో ఉన్నారు. డిజిటల్ మౌలిక వసతులు, క్లౌడ్, డేటా సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్ ఈ రంగానికి ప్రాధాన్యాన్ని పెంచుతోంది. ఇక ఫార్మా రంగం నుంచి ఆరోబిందో ఫార్మాకు చెందిన పి.వి. రామ్‌ప్రసాద్ రెడ్డి రూ.39,900 కోట్ల సంపదతో, హెటెరో గ్రూప్‌కు చెందిన బి. పార్థసారథి రెడ్డి కుటుంబం రూ.39,400 కోట్ల సంపదతో టాప్ 100లో చోటు సంపాదించారు.

**హైదరాబాద్ నాలుగో స్థానంలో..**

వ్యక్తిగత సంపదతో పాటు నగరాల వారీగా చూస్తే కూడా హైదరాబాద్ సత్తా చాటింది. దేశంలో అత్యధిక సంఖ్యలో సంపన్నులు ఉన్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. ముంబై, న్యూఢిల్లీ, బెంగళూరు తర్వాతి స్థానాన్ని హైదరాబాద్ దక్కించుకుంది.ఈ జాబితాలో దేశవ్యాప్తంగా గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీ వంటి పారిశ్రామిక దిగ్గజాలు అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. అయితే హైదరాబాద్ నుంచి ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నాలజీ రంగాలకు చెందిన వ్యాపార కుటుంబాలు ఒకేసారి టాప్ 100లో కనిపించడం నగర వ్యాపార పరిణామానికి మరో సంకేతంగా నిలుస్తోంది.

హైదరాబాద్ కేవలం ఐటీ, స్టార్టప్ హబ్‌గానే కాకుండా ఫార్మా, ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు వంటి రంగాల్లో భారీ వ్యాపార సామ్రాజ్యాలను సృష్టిస్తున్న నగరంగా ఎదుగుతున్నట్లు ఈ జాబితా సూచిస్తోంది.

## పిల్లల చదువుపై

# తల్లిదండ్రుల దృష్టి

పిల్లలు చదువుకునేటప్పుడు తమ శాయశక్తులా కృషి చేయాలి. కానీ కొన్నిసార్లు పిల్లలు గంటల తరబడి చదివినా సరే పరీక్షలో మంచి మార్కులు సాధించలేకపోతున్నారు. మీ పిల్లల విషయంలో కూడా ఇదే జరుగుతుందా? అయితే మీరు వారి విజయానికి ఆటంకం కలిగిస్తున్నారు కావచ్చు. ఎందుకంటే చాలా మంది తల్లిదండ్రులు తెలిసి లేదా తెలియకుండా చేస్తున్న కొన్ని తప్పులు వారికి ఇబ్బంది కలిగిస్తాయి.



**కలిసి చదవడం..**
వారిని ఒక్కరిని చదుకోనివ్వవద్దు. వారితో పాటు మరొకరు కూడా ఉంటే వారికి చాలా బెటర్ గా అనిపిస్తుంది. స్నేహితులు, లేదా తమ్ముడు, అన్న ఇలా ఎవరైనా సరే కలిసి చదువుకోవడం చాలా బెటర్. ఒకరికి ఆసక్తి లేకున్నా సరే మరొకరు వల్ల చదువుతారు. వారికి నిద్ర వస్తే వీరు లేపుతారు. అందుకే వారితో మరొకరిని ఉండనివ్వండి.

**పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తీసుకురావడం**
చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించగలరని నమ్ముతారు. వారు తమ పిల్లలపై చాలా ఎక్కువ అంచనాలను ఉంచి, వారిపై అధిక ఒత్తిడిని కలిగిస్తారు. ఇది పిల్లల మానసిక స్థితిని దెబ్బతీస్తుంది. ఈ ఒత్తిడి పిల్లల ఆత్మవిశ్వాసాన్ని బలహీనపరచడమే కాకుండా, ఆందోళన, ఒత్తిడిని కూడా పెంచుతుంది. కష్టపడి పనిచేయడం, నిలకడగా ఉండటం వల్ల మాత్రమే మంచి ఫలితాలు వస్తాయని పిల్లలకు వివరించండి. అలాగే, పిల్లలు మానసికంగా ఉత్సాహంగా ఉండేలా చదువుకునేటప్పుడు వారికి కొంత విశ్రాంతి, వినోద సమయాన్ని ఇవ్వండి.

**సరిగ్గా మార్గనిర్దేశం చేయకపోవడం.**
కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకోమని చెబుతారు. కానీ ఎలా చదువుకోవాలో ఎప్పుడూ చెప్పరు. వారు ఉత్తేజకరమైన రీతిలో చదువుకోవాలా లేదా తెలివిగా చదువుకోవాలా? సమయ నిర్వహణ, సరైన అధ్యయనం చేసే విధానాన్ని పిల్లలకు వివరించకపోవడం వారి విజయాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. పిల్లలకు టైమ్ టేబుల్, నోట్స్ తయారు చేసుకోవడం, రివిజన్ పద్ధతులు వంటి తెలివైన అధ్యయన సాధనాల గురించి నేర్పించండి. అలాగే, చదువు అనేది కేవలం పని మాత్రమే కాదు. సంతోషకరమైన అనుభవం అని వివరించండి.

**పిల్లలకు తగినంత నిద్ర**
చాలా సార్లు తల్లిదండ్రులు తమ పిల్లలు రాత్రంతా చదివితే మంచి మార్కులు వస్తాయని అనుకుంటారు. కానీ తగినంత నిద్ర లేకపోవడం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ఏకాగ్రత దెబ్బతింటాయని మీకు తెలుసా? నిద్ర ప్రాముఖ్యతను అర్థం చేసుకోకపోవడం వల్ల వారి పనితీరు దెబ్బతింటుంది.

**విద్యా విజయంపై దృష్టి పెట్టడం**
తల్లిదండ్రులు తరచుగా పిల్లల మంచి పనితీరు పుస్తకాలకే పరిమితం కావాలని నమ్ము తారు. కానీ వ్యక్తిత్వ వికాసం, సామాజిక నైపుణ్యాలు పిల్లలకు సమానంగా ముఖ్యమైనవని వారు మరచిపోతారు. చదువుపై మాత్రమే దృష్టి పెట్టడం వల్ల పిల్లలలో తెలివితేటలు, ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. పిల్లలు చదువులోనే కాకుండా క్రీడలు, సంగీతం, కళలు, సంస్కృతి, సామాజిక కార్యకలాపాలు వంటి జీవితంలోని ఇతర అంశాలలో కూడా పాల్గొనేలా ప్రేరేపించాలి. ఇది వారి మొత్తం పెరుగుదలను మెరుగుపరుస్తుంది. వారు ప్రతిచోటా నమ్మకంగా కనిపిస్తారు.

# రెక్కల పాములు..

పాములను సాధారణంగా భూమిపై పాకే జీవులు అని పిలుస్తారు. కానీ కొన్ని పాములు కూడా ఎగరగలవని మీకు తెలుసా? అవును, ప్రపంచంలో గాలిలో 30 మీటర్ల వరకు జారగల కొన్ని పాములు ఉన్నాయి. వాటిని 'ఫ్లయింగ్ స్నేక్' లేదా 'గ్లైడింగ్ స్నేక్' అని పిలుస్తారు. ఇవి ఇతర పాముల కంటే భిన్నంగా అనిపిస్తాయి.

**ఈ పాములు నిజంగా ఎగురుతాయా?**
ఎగిరే పాములు నిజానికి ఎగరవు. కానీ గాలిలో జారిపోతాయి. అవి ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు వెళ్ళడానికి గాలిలో ఎక్కువ దూరం దూకుతాయి. ఇది చెట్టు నుంచి దిగి మళ్ళీ ఎక్కడానికి సమయాన్ని ఆదా చేస్తుంది. ఈ పాములు 'పారడైజ్ ట్రీ స్నేక్స్' అనే క్రిసోపెలియా జాతికి చెందినవి. ఇవి దక్షిణ, ఆగ్నేయాసియా అడవులలో కనిపిస్తాయి. ఈ పాములు పొడవైన చెట్లపై నివసిస్తాయి. కీటకాలు, బల్లులు, చిన్న పక్షులను తిని జీవిస్తాయి.



**ఈ పాములు ఎలా ఎగురుతాయి?**
ఈ పాములు ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు వెళ్లాలనుకున్నప్పుడు, అవి తమ శరీరాన్ని చదును చేసి గాలిలోకి దూకుతాయి. ఈ సమయంలో, వాటి శరీరం పారాచూట్ లాగా పనిచేస్తుంది. దీని కారణంగా అవి నెమ్మదిగా కింద పడిపోతున్నప్పుడు ముందుకు కదులుతాయి. శాస్త్రవేత్తల ప్రకారం, ఈ పాముల వెన్నుపాము సరళంగా ఉంటుంది. దీని కారణంగా అవి గాలిలో తమ శరీరాన్ని సమతుల్యంగా ఉంచుకోగలుగుతాయి. వాటి ప్రత్యేకతలలో ఒకటి గాలిలో కూడా వాటి శరీర కదలికలను నియంత్రించగలవు. దీని కారణంగా, వాటికి జారడం సులభం అవుతుంది.

**ఎగిరే పాముల ప్రధాన జాతులు**
**గోల్డెన్ ట్రీ స్నేక్:** ఇవి థాయిలాండ్, ఇండోనేషియా, భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో కనిపిస్తాయి.
**పారడైజ్ ట్రీ స్నేక్:** ఇది మలేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్ అడవులలో కనిపిస్తుంది.
**ట్విన్-బార్డ్ ట్రీ స్నేక్:** ఇది ఒక చిన్న జాతి. ప్రధానంగా మలేషియా, సుమత్రాలలో కనిపిస్తుంది.

**ఎగిరే పాములు ఎక్కడ ఉంటాయి?**
ఈ పాములు ప్రధానంగా భారతదేశం (పశ్చిమ కనుమలు, ఈశాన్య అడవులు), థాయిలాండ్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్ వంటి ఆగ్నేయాసియాలోని ఉష్ణమండల అడవులలో కనిపిస్తాయి.

**ఎగిరే పాములు ప్రమాదకరమా?**
చాలా ఎగిరే పాములు విషపూరితమైనవి కావు. మానవులకు హానిచేయవు. వాటి విషం చిన్న కీటకాలు, జంతువులకు ప్రమాదకరం. కానీ మానవులు ప్రమాదకరం కాదు. అయితే, వాటిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తే, అవి భయంతో కాటు వేయవచ్చు. కానీ వాటి విషం మానవులకు ప్రాణాంతకం కాదు.

# వర్షాకాలం

## తేనెతో ఇలా..



వర్షాకాలం వచ్చిన వెంటనే, వాతావరణంలో తేమ పెరుగుతుంది. దీని కారణంగా మన చర్మం జిగటగా మారుతుంది. కొన్నిసార్లు చర్మం పొడిగా అనిపించడం ప్రారంభమవుతుంది. అతిపెద్ద సమస్య మొటిమలు, దద్దుర్లు లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్. అటువంటి పరిస్థితిలో, మీరు మీ చర్మాన్ని సరిగ్గా చూసుకోకపోతే, మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం ఒక కలగానే మిగిలిపోతుంది. కానీ మంచి విషయం ఏమిటంటే, ఇంట్లో ఉన్న 'తేనె' మీ చర్మ రక్షణ, అందాన్ని కాపాడుకోవడంలో చాలా సహాయపడుతుంది. మరి ఎలా అంటే?

**తేనెను పూయడం వల్ల చర్మం శుభ్రపడుతుంది.**

US నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం, తేనె అనేది ప్రధానంగా ఫ్రక్టోజ్, గ్లూకోజ్ అనే సహజ చక్కెరలతో కూడిన మందపాటి, తీపి ద్రవం. దీనితో పాటు, ఇందులో ప్రోటీన్లు, అమైనో ఆమ్లాలు, విటమిన్లు, ఎంజైమ్‌లు, ఖనిజాలు, అనేక ఇతర పోషకాలు కూడా ఉన్నాయి. శతాబ్దాలుగా చర్మ సంరక్షణ కోసం ప్రజలు దీనిని ఉపయోగిస్తున్నారు. తేనెలో ఉన్న యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు వర్షాకాల చర్మ సంరక్షణకు పరిపూర్ణంగా పని చేస్తాయి. తేనెను పూయడం వల్ల చర్మ రంధ్రాలు శుభ్రంగా ఉంటాయి. ఇది మొటిమలను తగ్గిస్తుంది. దీనిలో ఉండే ఎంజైమ్ హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను విడుదల చేస్తుంది. ఇది క్రిములను చంపుతుంది.
వర్షాకాలంలో తరచుగా గాయాలు లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. ముఖ్యంగా పాదాలు, శరీరంలోని తడి భాగాలపై ఎక్కువ వస్తాయి. అటువంటి పరిస్థితిలో, గాయం లేదా కాలిన చర్మంపై నేరుగా తేనెను పూయడం వల్ల గాయం త్వరగా నయం అవుతుంది. వాపు కూడా తగ్గుతుంది. పిట్రియాసిస్, టినియా, సెబోరియా, చుండ్రు, డైపర్ దద్దుర్లు, సోరియాసిస్, హెమోరాయిడ్స్, పగుళ్లు సమస్యలకు చికిత్స చేయడానికి కూడా తేనె ఉపయోగిస్తారు.

**యవ్వనంగా**

సౌందర్య సాధనాలలో తేనె వాడకం చాలా సాధారణం. తేనె ఒక అద్భుతమైన ఎమోలియంట్ (చర్మాన్ని మృదువుగా చేసేది), హ్యూమెక్టెంట్ (తేమ నిలుపుదల), రిలాక్సెంట్, హెయిర్ కండిషనర్ గా పని చేస్తుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడుతుంది. ముడతలను తగ్గిస్తుంది. చర్మ pH సమతుల్యతను కాపాడుతుంది. చర్మాన్ని వ్యాధుల నుంచి సురక్షితంగా ఉంచుతుంది.

**తేనె చర్మంపై ఎలా పనిచేస్తుంది?**

US నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం, తేనె పనితీరు అది పొందే మొక్క లేదా పువ్వుపై కూడా ఆధారపడి ఉంటుంది. వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లు, సైటోకిన్‌ల ఉత్పత్తి, మ్యాట్రిక్స్ మెటాలో ప్రోటీనేస్ ఎంజైమ్‌ల ప్రభావాలు వివిధ రకాల తేనెలలో కనిపిస్తాయి. ఈ మూలకాలన్నీ కలిసి చర్మాన్ని బాగు చేస్తాయి. గాయం నయం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ముఖ్యంగా చర్మంపై గాయం లేదా ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు మరింత పని చేస్తాయి. అంటే, తేనె అందానికి, రంగును అందించడంలోనే కాకుండా, వైద్యంలో కూడా ఉపయోగపడుతుంది అన్నమాట.

# పడుకోగానే ఇట్టే నిద్రపట్టే మంత్రం..

మనిషి ప్రశాంతంగా ఉన్నారు అని చెప్పవచ్చో మీకు తెలుసా? తనకు మంచి నిద్ర, తినే ఆహారం సరిగ్గా జీర్ణం అవడం, టెన్షన్ ఫ్రీగా ఉంటే చాలు జీవితానికి. కానీ మనిషి ఇవన్నీ వదిలి అనవసరమైన ఆనందాల వైపు పరుగులు పెడుతున్నాడు. సరే అది ఇప్పుడు చెప్పినా ఎవరు వినరు కదా. అయితే మీకు మంచి నిద్ర పడుతుందా? మంచి నిద్ర అంటే బెడ్ మీదికి వెళ్లగానే ఇట్టే నిద్ర వచ్చేయాలి. వెళ్లిన రెండు మూడు గంటల తర్వాత లేదా తెల్లవారు జామున నిద్రలోకి జారుకోవడం కాదు అంటున్నారు నిపుణులు. అందుకే ఇప్పుడు మనం పడుకోగానే నిద్ర రావాలంటే ఏం చేయాలో తెలుసుకుందామా?
సరైన నిద్ర లేక చాలా మంది నిద్రమాత్రలు కూడా వేసుకుంటున్నారు. అయితే, నిద్రపోయే ముందు ఫోన్, లాప్, కంప్యూటర్ వంటి వాటికి కాస్త దూరం మెయింటెన్ చేయండి. చదవడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోండి. మీ మైండ్ ను ప్రశాంతంగా ఉంచుకోండి అంటున్నారు వైద్యులు. నిద్రలేమి సమస్య చాలా ఆందోళన కలిగిస్తుంది. తరువాత క్రమంగా అది ప్రమాదకరమైన రూపాన్ని అందుకుంటుంది. అప్పుడు మరింత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విషయాలు పనిచేస్తాయి. కాబట్టి ఏది పనిచేస్తుందో తెలుసుకోవడానికి కొంత సమయం కేటాయించండి. ఆ తర్వాత దాన్ని పాటించండి.

**సరైన నిద్ర కోసం దశలు**
**దినచర్యను ఏర్పరచుకోండి:** ప్రతి వ్యక్తి తన రోజంతా ఒక దినచర్యను ఏర్పరచుకోవాలి. అంటే, ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోయి మేల్కొనాలి.
**పడుకునే ముందు స్క్రీన్‌లు:** నిద్రవేళకు కొన్ని గంటల ముందు ఫోన్‌లు లేదా టాబ్లెట్‌లు వంటి బ్లూ లైట్ స్క్రీన్‌లను ఉపయోగించకుండా ఉండండి. ఎందుకంటే ఇది మీ నిద్రకు భంగం కలిగించే అవకాశం ఉంది. మీ దినచర్యకు కూడా అంతరాయం కలిగించవచ్చు.
**రాత్రిపూట భారీ ఆహారం తినడం లేదా తాగడం:** నిద్రపోయే ముందు భారీ ఆహారం, మద్యం, కెఫిన్, పొగాకు తినకుండా ఉండండి. ఇది మీ ఆరోగ్యానికి చాలా హానికరం. ఇలాంటి వాటికి దూరంగా ఉంటే మీకు మంచి నిద్ర వస్తుంది.
**పడుకునే ముందు విశ్రాంతి:** స్నానం చేయడం, పుస్తకం చదవడం లేదా సంగీతం వినడం ప్రయత్నించండి. వీటి వల్ల మీ మూడ్ చాలా మెరుగు అవుతుంది. అప్పుడు నిద్ర కూడా ఇట్టే వచ్చేస్తుంది.
**మీ పడకగదిని సౌకర్యవంతంగా చేసుకోండి:** మీ మంచం సౌకర్యవంతంగా, కూల్ గా ఉండేలా చూసుకోండి. మీ గది చీకటిగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోండి. అప్పుడే మరింత ప్రశాంతమైన నిద్రలోకి జారుకుంటారు.
**రోజూ వ్యాయామం చేయండి:** రోజంతా చురుగ్గా ఉండటానికి, రోజూ వ్యాయామం చేయండి.
**తీసుకోవాల్సిన ఆహారం:** పడుకునే ముందు పిస్తా, ఓట్ మీల్, హెర్బల్ టీలను తీసుకోండి. వీటి వల్ల ఫలితం ఉంటుంది.



### నేరేడు గింజలతో శరీరానికి యాంటీఆక్సిడెంట్ రక్షణ

నేరేడు గింజలోని సహజ సమ్మేళనాలు ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కలిగే ఆక్సిడేటివ్ డ్యామేజ్‌ను ఎదుర్కోవడంలో సహాయపడే అవకాశం ఉంది. అందుకే వీటిని సంప్రదాయ ఆరోగ్య పద్ధతుల్లో ఉపయోగిస్తున్నారు.



# వైభవోపేతంగా విఘ్నేశ్వరునికి వీడ్కోలు

## రికార్డు ధరకు కూకట్‌పల్లి 'బొజ్జ గణపయ్య' లడ్డూ

**రూ.7,00,116 దక్కించుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ బొజ్జ గణపయ్య (బీజేపీ గణేష్) స్వామివారి మహా లడ్డు ప్రసాదం వేలం పాటలో రికార్డు స్థాయి ధర పలికింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రూ.7,00,116 సమర్పించి ఈ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. 11 రోజుల పాటు నిష్ఠతో పూజలందుకున్న ఈ లడ్డు వేలం, గత రికార్డులను తిరగరాస్తూ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.లడ్డు ప్రసాదాన్ని దక్కించుకోవడంపై వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, గణనాథుని ఆశీస్సులు తనపై ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. గత 51 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో, సేవా భావంతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు నాయినేని సూర్యప్రకాష్ రావు, అద్వాని సూర్యారావు, చౌదరి సూర్యారావు, జలంధర్ రావులను ఆయన అభినందించారు. స్వామివారి కృపతో కూకట్‌పల్లి ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వినాయక భక్త బృందం నిర్వాహకులు, సభ్యులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బాలాపూర్ లడ్డు వేలం పాట విశేషాలు హైదరాబాద్‌లోని గణేష్ ఉత్సవాల్లో లడ్డు వేలం పాటలు అత్యంత ప్రాముఖ్యత మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగి ఉన్నాయని ఈ వీడియో వివరిస్తుంది.

## రంగధాముని చెరువు వద్ద మహా అన్నదానం



గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద భక్తులకు, ఊరేగింపులో పాల్గొన్న జనానికి వీఎన్ఆర్ ట్రస్ట్ సౌజన్యంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సమేతంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... “అన్ని దానాల్లోకెల్లా అన్నదానం అత్యంత శ్రేష్ఠమైనదని, భగవంతుని భక్తులకు సేవ చేయడం దైవసేవతో సమానమని” పేర్కొన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులందరిపై ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీఎన్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మూసాపేట్ 'కా రాజా' గణపతి నిమజ్జనం





నవ యువక యూత్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు ఆహ్వానం మేరకు మూసాపేట్ 'కా రాజా' మహా గణపతి నిమజ్జన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర





కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గణపతి నిమజ్జన మహోత్సవం విజయవంతంగా సాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, లక్ష్మణ్, రమణ, అస్లాం, కుమారస్వామి, జగదీష్, వాసులతో పాటు నవ యువక యూత్ అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గంగా హారతి





**మెదక్ పట్టణంలో వినాయక నిమజ్జనం శోభాయాత్రలో గంగా హారతి భక్తులను ఆకట్టుకుంది. సాయి నగర్ మణికంఠ గణేష్ మండలి ఆధ్వర్యంలో కాశీ నుండి రప్పించిన పండితులతో గంగా హారతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భజనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ కాసుగు రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కమీషనర్ నవీన్, కౌన్సిలర్లు, టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.**

**- ముద్ర ప్రతినిధి, మెదక్**

# లడ్డూ వేలంలో లక్షలు పెడుతున్నారా?

**పన్ను లెక్కలు కూడా తెలుసుకోవాల్సిందే!**

**ముద్ర, హైదరాబాద్ :** గణపతి బప్పా మోరియా.. అంటూ వినాయక చవితి వేడుకల్లో భక్తులు పోటీపడి పాడుతున్న లడ్డూ వేలం ఇప్పుడు ట్రెండింగ్ మాత్రమే కాదు.. కోట్లకు పడగెత్తుతున్న ప్రతిష్ఠాత్మక వ్యవహారం.. భక్తి, నమ్మకం, పాజిటివ్ వైబ్స్ కోసం లక్షలు గుమ్మరించి ప్రసాదాన్ని ఇంటికి తెచ్చుకోవడం వరకు బాగానే ఉంది.. కానీ ఆ వేలం పాట ముగిశాక ఇన్ కం ట్యాక్స్ ఆఫీసర్ల నుంచి ఫోన్ వస్తే ఏం చేస్తారు? భక్తికి హద్దులు లేవు సరే.. మరి మీరు లడ్డూ కోసం చెల్లించిన లక్షలకు సరైన లెక్కలు ఉన్నాయా? ‘లడ్డూ కొంటే పన్ను పడుతుందా? 80జీ కింద మినహాయింపు దక్కుతుందా?’ అనే అంశంపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అసలు పన్ను లెక్కలు ఇవే!వినాయక చవితి ఉత్సవాలు ముగిసే సమయానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినిపించే మాట ‘లడ్డూ వేలం’. ఒకప్పుడు వందలు.. వేలల్లో సాగిన గణపతి లడ్డూ వేలం ఇప్పుడు లక్షలు దాటి కోట్ల రూపాయలకు చేరుతున్న సందర్భాలు ఉన్నాయి. భక్తి, సెంటిమెంట్, ప్రతిష్ఠ, స్వామివారి ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే నమ్మకం.. ఇలా ఎన్నో కారణాలతో భక్తులు భారీ మొత్తాలకు వేలం పాడుతున్నారు. అయితే లక్షలు చెల్లించి లడ్డూను దక్కించుకున్న వ్యక్తికి పన్ను పరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయా? అసలు వేలంలో చెల్లించిన మొత్తాన్ని ఆదాయంగా పరిగణిస్తారా? 80జీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చా? అనే సందేహాలు ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.లడ్డూ కొంటే ఆదాయ పన్ను పడుతుందా?సాధారణంగా లడ్డూను వేలంలో కొనుగోలు చేసి దానికి ఒక మొత్తాన్ని చెల్లించడం.. ఆ మొత్తాన్ని కొనుగోలుదారుడి ఆదాయంగా పరిగణించడం ఒకటే విషయం కాదు. ముఖ్యంగా ఇన్ కం ట్యాక్స్ యాక్ట్ లోని సెక్షన్ 56(2)(ఎక్స్) అనేది ప్రధానంగా ఒక వ్యక్తికి డబ్బు లేదా కొన్ని రకాల ఆస్తి ఉచితంగా లేదా నిర్దేశిత పరిస్థితుల్లో తక్కువ విలువకు లభించిన సందర్భాలను నియంత్రిస్తుంది. అందువల్ల “రూ.50 వేలకు పైగా లడ్డూ



వేలం పాడితే ఆ మొత్తానికే 56(2)(ఎక్స్) కింద పన్ను” అనే సింపుల్ ఫార్ములా వర్తించదు. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. వేలం మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా చెల్లించారు? దానికి సరైన ఆర్థిక ఆధారం ఉందా? అన్నది పెద్ద మొత్తాల విషయంలో ముఖ్యంగా మారుతుంది.80జీ ఉంటే పన్ను మినహాయింపు వస్తుందా?లడ్డూ వేలం మొత్తాన్ని ‘డొనేషన్’గా చూపించి 80జీ కింద మినహాయింపు పొందాలంటే కేవలం ఆ మొత్తాన్ని దేవాలయం లేదా గణేష్ ఉత్సవ కమిటీకి చెల్లించడం సరిపోదు. ఆ మొత్తాన్ని స్వీకరిస్తున్న సంస్థ సెక్షన్ 80జీ కింద అర్హత పొందిన సంస్థగా ఉండాలి. అర్హత ఉన్న సంస్థలకు ఇచ్చే విరాళాలపై 50 శాతం లేదా 100 శాతం వంటి వివిధ రకాల డిడక్షన్ లు నిబంధనల ఆధారంగా ఉంటాయి. అలాగే 80 జీ కింద నగదు విరాళాలకు రూ.2,000 పరిమితి ఉంది. అంటే ప్రతి గణేష్ ఉత్సవ కమిటీకి 80జీ ఉంటుందని భావించడం సరికాదు.అసలు కీలకమైన ప్రశ్న ఇదే..ఒక వ్యక్తి రూ.10 లక్షలు, రూ.20 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తానికి లడ్డూను వేలంలో దక్కించుకున్నాడనుకుందాం. ఈ డబ్బు చెల్లించడానికి అతని వద్ద చట్టబద్ధమైన ఆదాయ వనరు ఉండాలి. జీతం, వ్యాపార ఆదాయం, గతంలో ఉన్న పొదుపులు, బ్యాంకు లావాదేవీలు వంటి వాటికి సరైన ఆధారాలు ఉంటే పెద్ద మొత్తంలో చెల్లింపు చేయడం మాత్రమే పన్ను సమస్యకు కారణం కాదు. కానీ ఆదాయానికి సరైన లెక్కలు లేకుండా భారీ మొత్తాలను ఖర్చు చేస్తే పన్ను అధికారులు ఆ డబ్బు మూలంపై వివరణ కోరే అవకాశం ఉంటుంది.వేలం పాడే ముందు ఏం చూసుకోవాలి?లడ్డూ వేలంలో భారీ మొత్తానికి బిడ్ చేసే వ్యక్తులు కొన్ని విషయాలను ముందుగానే పరిశీలించడం మంచిది. చెల్లింపు బ్యాంకింగ్ మార్గంలో చేయడం.. వేలం రసీదు తీసుకోవడం.. ఉత్సవ కమిటీ/సంస్థ చట్టబద్ధమైన స్థితిని తెలుసుకోవడం..80జీ గుర్తింపు ఉందా లేదా పరిశీలించడం.. 80జీ డిడక్షన్ కోసం అవసరమైన ధ్రువపత్రాలు ఉన్నాయా చూడడం ముఖ్యం.చెల్లిస్తున్న మొత్తం తనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయంతో సంబంధం ఉన్నట్లు రికార్డులు ఉంచుకోవడం చాలా చాలా ముఖ్యం. 80జీ కింద అర్హత ఉన్న సంస్థలు విరాళాల వివరాలను ఆదాయ పన్ను శాఖకు సమర్పించి.. అర్హత ఉన్న దాతలకు సంబంధిత డొనేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన విధానం కూడా ఉంది.భక్తికి ధర ఉండదు.. కానీ డబ్బుకు లెక్క ఉండాలి..లడ్డూ వేలంలో లక్షలు పెట్టడం భక్తి, విశ్వాసం, సెంటిమెంట్‌తో ముడిపడి ఉంటుంది. వేలంలో గెలిచిన వ్యక్తికి ఆ లడ్డూ కేవలం ప్రసాదం కాకుండా ఒక విశ్వాసానికి ప్రతీకగా భావించవచ్చు. అయితే పన్ను చట్టాల దృష్టిలో మాత్రం భావోద్వేగాల కంటే లావాదేవీ స్వరూపం, డబ్బు మూలం, చెల్లింపు విధానం, అందుకున్న రసీదు, సంస్థకు ఉన్న పన్ను అర్హతలు వంటి అంశాలకే ప్రాధాన్యం ఉంటుంది. అందుకే “లడ్డూ కోసం ఎంతైనా పెడతాం” అని వేలంలో బిడ్ చేసే ముందు.. “ఈ మొత్తానికి నా దగ్గర లెక్క ఉందా?” అనే ప్రశ్న కూడా వేసుకోవడం మంచిదే.

# మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

**గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో కాంస్య విగ్రహం**
**నేడు సీఎం రేవంత్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ**
**ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతికి పునాది**
**తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్రపై ప్రశంసలు**





**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన భారత మాజీ ప్రధాని, దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి, అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అందించిన చారిత్రాత్మక సేవలను స్మరించుకున్నారు. విప్రో సర్కిల్‌లో నెలకొల్పిన ఈ విగ్రహం కేవలం ఒక స్మారకం మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర, ఆర్థిక దూరదృష్టి , నిరాడంబర నాయకత్వాన్ని భావితరాలకు గుర్తుచేసే నిత్య స్ఫూర్తి అని కొనియాడారు.ఆర్థిక సంస్కరణల పితామహుడు.. దేశ ప్రగతికి బలమైన పునాదిభారత దేశాన్ని ఆర్థిక ప్రగతి పథంలో నడిపించిన మహోన్నత ఆర్థికవేత్తగా మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 1991లో ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిగా చేపట్టిన ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థ రూపరేఖలను పూర్తిగా మార్చివేశాయని గుర్తుచేశారు. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా పదేళ్ల పాటు దేశ ఆర్థిక స్థిరత్వం, జాతీయ అభివృద్ధి , ప్రజా సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలు అతులితమైనవన్నారు. తన హయాంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం వంటి చారిత్రాత్మక నిర్ణయాలను అమలు చేసి సామాన్యులకు హక్కులు, అవకాశాలను విస్తరించారని ప్రశంసించారుతెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర చారిత్రాత్మకంతెలంగాణ ప్రజల దశాబ్దాల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్ర అత్యంత కీలకమైనదని మంత్రి స్పష్టం చేశారు. 2009లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించడం నుంచి, 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే వరకు సాగిన పరిణామాల్లో ఆయన నాయకత్వం చారిత్రాత్మకమని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావంలో నాటి యూపీఏ ప్రభుత్వం , మన్మోహన్ సింగ్ వహించిన పాత్రను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో పనిచేయడం తన ప్రజా జీవితంలో గొప్ప గర్వకారణమని, ఆయన సహకారంతోనే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లగలిగానని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

## ఉప ఎన్నిక : మరోదారి లేని ‘దానం’ !



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టు వేసిన అనర్హత వేటును తప్పించుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టు వేసిన అనర్హత వేటును కొట్టేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఒక పార్టీ నుండి గెలిచి మరొక పార్టీ నుండి ఎంపీగా పోటీ చేయడాన్ని తప్పుపడుతూ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, అనర్హత వేటు నేపథ్యంలో ఉప ఎన్నికలకు వెళ్లాలని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ మోహన బెంచ్ ‘హైకోర్టు తీర్పు లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి ఆధారాలు లేవని’ తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా దానం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు.2023 శాసనసభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్ 2024 మార్చిలో కాంగ్రెస్ పార్టీలో చేరి లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుండి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు దానంతో పాటు పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద స్పీకర్ వద్ద అనర్హత పిటీషన్లు దాఖలు చేశారు. అయితే అనర్హత పిటీషన్లపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ జాప్యం చేయడంతో బీఆర్ఎస్ హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో 2025 జూలై 31న సుప్రీంకోర్టు మూడు నెలల్లో అనర్హత అంశాన్ని తేల్చాలని స్పీకర్ ను ఆదేశించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ ఏడాది మార్చి 11న ఫిరాయింపులకు తగిన ఆధారాలు లేవంటూ అనర్హత పిటీషన్లను కొట్టేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సెప్టెంబర్ 18న విచారించిన హైకోర్టు దానం నాగేందర్ మీద అనర్హత వేటు వేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ శాసనసభ స్థానం ఖాళీ అయిందని ఆర్డర్ ను స్పీకర్, శాసనసభ కార్యదర్శి, ఎన్నికల కమిషన్ కు పంపాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్పందించిన దానం నాగేందర్ ‘తీర్పును స్వాగతిస్తున్నానని, సుప్రీంకోర్టుకు వెళ్లనని, ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని’ ప్రకటించారు. కానీ 24 గంటల్లోనే యూ టర్న్ తీసుకుని సుప్రీంకోర్టును ఆశ్రయించినా అక్కడ ఊరట లభించక పోవడంతో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయం అని తేలిపోయింది.

## నిమజ్జనంలో తల్వార్లతో యువకుల హల్‌చల్

**ఖమ్మంలో కలకలం.!**



**ముద్ర, డెస్క్**

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్‌లో గణేష్ నిమజ్జన ఊరేగింపులో కొందరు యువకులు బహిరంగంగా తల్వార్లు, పెద్ద పెద్ద కత్తులు చేతబూని రోడ్లపై హల్‌చల్ చేశారు. చేతుల్లో పదునైన ఆయుధాలు పట్టుకుని గట్టిగా కేకలు వేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించారు. కత్తులు తిప్పుతూ, నృత్యాలు చేస్తూ రోడ్లపై సంచరించిన ఈ దృశ్యాలను కొందరు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్త వేగంగా వైరల్ అయ్యాయి. పదునైన తల్వార్లను ప్రదర్శిస్తూ యువకులు చేసిన ఈ చర్యలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆధ్యాత్మిక ఉత్సవాల పేరిట ఇలా బహిరంగంగా ఆయుధాలతో హంగామా చేయడం ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చిపెట్టేలా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జన సమయంలో డీజేల వినియోగానికి ఎటువంటి అనుమతి లేకపోయినప్పటికీ, అక్కడ యథేచ్ఛగా డీజేలు మోగిస్తూ ఊరేగింపు నిర్వహించడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద సౌండ్ సిస్టమ్‌లు , పదునైన ఆయుధాలతో యువకులు స్వేచ్ఛగా రోడ్లపైకి వస్తుంటే రఘునాథపాలెం పోలీసులు పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైరల్ అయిన వీడియో ఆధారంగా పోలీసులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని, నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నేరేడు గింజలను ఎలా తీసుకోవాలి? జాగ్రత్త తప్పనిసరి

గింజలను ఎండబెట్టి పొడిగా చేసుకునే సంప్రదాయం ఉంది. అయితే డయాబెటిస్ మందులు వాడుతున్న వారు వైద్యుల సలహా లేకుండా నేరేడు గింజల పొడిని రోజూ తీసుకోవడం మంచిది కాదు. 'వెంటనే షుగర్ కంట్రోల్' చేస్తుంది అనడం శాస్త్రీయంగా నిరూపితం కాలేదు.



# గణేశ్ నిమజ్జనంపై హైటెక్ నిఘా..

**10 వేల కెమెరాలు, డ్రోన్లు రంగంలోకి..**
**బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు నిఘా**
**12 డ్రోన్లతో లైవ్ మానిటరింగ్**
**15 వేల మంది పోలీసులతో భారీ భద్రత**
**నెల రోజుల పాటు సీసీ కెమెరాల ఫుటేజ్ భద్రత**

**ముద్ర, హైదరాబాద్ :** మహానగరంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలను అత్యంత శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అపూర్వమైన రీతిలో భారీ హైటెక్ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నగర వ్యాప్తంగా నిమజ్జన ప్రక్రియను అంగుళం అంగుళం పర్యవేక్షించేందుకు సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ICCC) వేదికగా కట్టుదిట్టమైన వ్యవస్థను సిద్ధం చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధితో పాటు మల్కాజిగిరి ప్రాంతాల్లో జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీనియర్ అధికారులు నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

**బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు డ్రోన్ నిఘా**

నగరవ్యాప్తంగా దాదాపు 10,000కు పైగా అధునాతన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించారు. ముఖ్యంగా బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు సాగే ప్రధాన నిమజ్జన శోభాయాత్ర మార్గంలో ప్రతి అడుగును ఈ కెమెరాల ద్వారా డిజిటల్ గా మానిటర్ చేస్తున్నారు. దీనికి అదనంగా ప్రత్యేకంగా 12 హై-రెజల్యూషన్ డ్రోన్లను రంగంలోకి దించారు. ఈ డ్రోన్ల ద్వారా వచ్చే లైవ్ విజువల్స్ ఆధారంగా శోభాయాత్రలో రద్దీ తీవ్రతను, శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన సూచనలు అందిస్తున్నారు.

**15 వేల మంది పోలీసులు.. 15 శాఖల మల్టీ-ఏజెన్సీ సమన్వయం**

ఈ భారీ ఉత్సవం సునాయాసంగా సాగేందుకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బందిని విధుల్లో నియమించారు. కేవలం పోలీస్ శాఖ మాత్రమే కాకుండా హైడ్రా, విద్యుత్, రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక శాఖలతో పాటు సుమారు 12 నుంచి 15 విభిన్న ప్రభుత్వ శాఖల అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సంయుక్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్సవాల్లో ఏదేని అత్యవసర పరిస్థితి తలెత్తితే లేదా 112 నంబర్ కు బాధితుల నుంచి కాల్స్ వస్తే తక్షణమే స్పందించేలా మల్టీ-ఏజెన్సీ రెస్పాన్స్ టీమ్ లు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి.

**నెల రోజుల బ్యాకప్.. గంట గంటకు విగ్రహాల లెక్కింపు**

భద్రత విషయంలో రాజీ పడకుండా ఈ నిఘా కెమెరాల ద్వారా రికార్డయ్యే దృశ్యాలన్నింటినీ నెల రోజుల పాటు భద్రపరిచేలా విస్తృత రికార్డింగ్ బ్యాకప్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా ఆకతాయిల చర్యలు చోటుచేసుకున్నా, ఈ డిజిటల్ డేటాను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లకు అందించి నిందితులను వేగంగా గుర్తించడానికి ఉపయోగిస్తారు. అలాగే వివిధ ఘాట్ల వద్ద ప్రతి గంటకు నిమజ్జనమైన గణనాథుల విగ్రహాల ఖచ్చితమైన వివరాలను సేకరించి, సీనియర్ అధికారులకు ఎప్పటికప్పుడు అప్ డేట్స్ అందిస్తూ నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

## రాయికల్ జలపాతం : పర్యాటకులకు సీఐ హెచ్చరిక



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ గ్రామ శివారులో ఉన్న జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు తమ ఆనందనకర క్షణాలను విషాదంగా మలుచుకోవద్దని, పోలీస్ శాఖ నిబంధనలు అతిక్రమించొద్దని హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తమ సిబ్బందితో కలిసి రాయికల్ జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జలపాతం వీక్షించేందుకు వచ్చే సందర్శకులు గుట్టల ప్రాంతంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దన్నారు. ఎక్కడైనా మద్యం సేవించినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జలపాతం వద్దకు వచ్చే సందర్శకులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇటు పోలీస్ శాఖ, అటు గ్రామపంచాయతీ సిబ్బంది సహకరించాలని సూచించారు. పర్యటకులు సెల్ఫీల పేరిట గుట్టల ప్రాంతంలో, ప్రమాదకర స్థలాలలో, నీటి ప్రవాహమున్న చోట్ల ఫోటోలు దిగొద్దని, అలా ఫోటోలు దిగుతూ ప్రమాదాలకు గురి కావద్దని హెచ్చరించారు. సీఐ వెంట సైదాపూర్ ఎస్సై కే స్వాతి, రాయికల్ సర్పంచి అఖిల, ప్రకాశ్‌రెడ్డి, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి ఎత్తిపోతలు

**ముద్ర, జగిత్యాల :** శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి శ్రీ రాజరాజేశ్వర మధ్యమానేరు జలాశయానికి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నాలుగు మోటార్ల చొప్పున నంది, గాయత్రీ పంప్ హౌస్‌లలోని 12,600 క్యూసెక్కుల నీటిని వరద కాలువలోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. రెండు రోజులుగా గోదావరి పరివాహక ప్రాంతంలో వర్షాలతో ఎల్లంపల్లి జలాశయానికి శుక్రవారం 9,849 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. వారం రోజులుగా రెండు మోటార్ల చొప్పున నంది, గాయత్రి పంప్ హౌస్‌ల్లోని 6,300 క్యూసెక్కుల నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలించారు. ఎల్లంపల్లి జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకోవడం, పై నుంచి వరద వస్తుండటంతో అందుకు తగినట్లుగా మోటార్ల సంఖ్యను పెంచారు.



# కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి 30న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

**కలెక్టరేట్ ప్రారంభానికి ముహూర్తం**

**ముద్ర, కరీంనగర్ :** ఎట్టకేలకు జిల్లా నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. గతంలోనూ ప్రారంభోత్సవానికి ఒకట్రెండుసార్లు తేదీలు ఖరారు చేసినప్పటికీ పలు కారణాలతో వాయిదా పడింది. ఈసారి సీఎం సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో కరీంనగర్‌లో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసి కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌తోపాటు మరికొన్నింటికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ విషయంపై 26న సీఎం కార్యక్రమాల వివరాలను కరీంనగర్‌లో ప్రకటిస్తానని మంత్రి తెలిపారు.

**సమీక్ష, పరిశీలన**

మంత్రి పొన్నం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంతో కలిసి కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. నూతన కలెక్టరేట్ సముదాయ ఆవరణ తోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం ఆకర్షణీ యంగా తీర్చిదిద్దాలని, భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాల ని ఆదేశించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన హెలీప్యాడ్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**అధికారులతో సమావేశం**

అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం జరిపి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఇక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్తారన్నారు. కలెక్టర్ చిత్రామిశ్రా, సీపీ గౌష్ ఆలం, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల ఉన్నారు.



## కెనాల్‌లో గల్లంతయిన యువకుడి మృతదేహం లభ్యం

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన తాండ్ర రుద్ర అనే యువకుడు మల్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద కెనాల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. కెనాల్‌లో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో రుద్ర నీటిలో గల్లంతయ్యాడు. యువకుడి ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు, స్థానికులు, సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎల్ఎండీ (లోయర్ మానేరు డ్యామ్) ప్రాంతంలో రుద్ర మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసే ప్రక్రియను మేయర్ దగ్గరుండి పర్యవేక్షించారు.బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు..

## మహిళలకు రక్షణ కల్పించాలి: ఎస్ఎఫ్ఐ

**ముద్ర, కరీంనగర్ :** దేశంలో రోజురోజుకూ మహిళలకు రక్షణ దొరకడం లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంజన ఆరోపించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వాజేశ్వరి డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంజన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ఇటీవల బిహార్‌లో మైనర్ బాలికపై జరిగిన దాడి, ఢిల్లీలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే మహిళా రక్షణ చట్టాలను, సంబంధిత ప్రత్యేక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.




# చైనా డబుల్‌గేమ్.. భారత్‌కు కొత్త టెన్షన్?

**ముద్ర, న్యూఢిల్లీ :** ఢిల్లీలో ప్రధాని మోదీతో కరచాలనం చేసిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. ఇప్పుడు వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కీలక చర్చలు జరిపారు. సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ-జిన్‌పింగ్ భేటీ జరగగా.. సెప్టెంబర్ 24న వైట్‌హౌస్‌లో ట్రంప్-జిన్‌పింగ్ సమావేశమయ్యారు. రెండు పర్యటనల మధ్య కేవలం 12 రోజుల వ్యవధి ఉండటం ప్రపంచ దౌత్య వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. వీరిద్దరి మధ్య చర్చల్లో వాణిజ్యం, తైవాన్, AI, టెక్నాలజీ, అరుదైన ఖనిజాలు, ఇరాన్ వంటి అంశాలు కీలకంగా మారాయి. అమెరికా-చైనా వాణిజ్య సంధిని మరో రెండు నెలలు పొడిగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

**మోదీతో భేటీ తర్వాతే ట్రంప్‌తో సమావేశం**

బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ ఇరుదేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిపారు. సరిహద్దుల్లో శాంతి, ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణ, వాణిజ్య అసమతుల్యత, సరఫరా చైన్, వ్యాపార సంబంధాలను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చ జరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ఇరుదేశాల ఒప్పందాలను పాటించడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని మోదీ స్పష్టం చేశారు. చైనా కూడా భారత్‌తో సంబంధాలను దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టితో అభివృద్ధి చేయాలని చెబుతోంది. జిన్‌పింగ్-మోదీ భేటీ తర్వాత చైనా ప్రకటనలో ఇరుదేశాలు భాగస్వాములుగా ఉండాలనే అంశాన్ని ప్రస్తావించింది.

**అసలు టెన్షన్ ఇదే**

ఇప్పటివరకు అమెరికా-చైనా పోటీ కారణంగా చైనా నుంచి దూరమయ్యే కంపెనీలకు భారత్ ఒక ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ఎదిగే అవకాశం వచ్చింది. 'China+1' వ్యూహం ద్వారా పెట్టుబడులు, సరఫరా గొలుసులు భారత్ వైపు మళ్లే అవకాశం ఏర్పడింది. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గి.. చైనా మళ్లీ అమెరికా మార్కెట్‌తో స్థిరమైన సంబంధాలు ఏర్పరచుకుంటే, ఈ అవకాశాల్లో కొంత భాగం తగ్గే అవకాశం ఉందని విశ్లేషణలు చెబుతున్నాయి. తైవాన్, AI, టెక్నాలజీ నియంత్రణలు, వాణిజ్య సుంకాలు, ఇరాన్ యుద్ధంపై ఇరుదేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా రేర్ ఎర్త్స్ సరఫరాలో చైనాకు ఉన్న ఆధిపత్యం కారణంగా ఈ రంగంలో కుదిరే ఏదైనా అమెరికా-చైనా అవగాహన ప్రపంచ సరఫరా గొలుసులపై ప్రభావం చూపవచ్చు. దాని ప్రభావం భారత్ తయారీ, టెక్నాలజీ రంగాలపై కూడా పరోక్షంగా పడే అవకాశం ఉంది.



**చైనా లెక్కల్లో భారత్ ఎందుకు?**

ఇక్కడే భారత్ అంశం ఆసక్తికరంగా మారుతోంది. అమెరికా ఇప్పటికే ఇండో-పసిఫిక్‌లో భారత్‌ను కీలక వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తోంది. మరోవైపు భారత్ చైనాతో సంబంధాలను పూర్తిగా తెంచుకోకుండా.. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అంశాలను పరిష్కరించుకుంటూ సంబంధాలను స్థిరీకరించే ప్రయత్నం చేస్తోంది. అంటే.. అమెరికాతో భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది.. చైనాతో భారత్‌కు ఆర్థిక, భౌగోళిక సంబంధాలు ఉన్నాయి. ఈ రెండు సమీకరణాల మధ్య న్యూఢిల్లీ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోంది.

**రష్యా అంశం కూడా కీలకమే..**

రష్యా చమురు, ఇరాన్ అంశాల్లో భారత్, చైనాలపై అమెరికా విధానం కూడా న్యూఢిల్లీకి ముఖ్యమే. అమెరికా-చైనా చర్చల్లో బీజింగ్‌కు రష్యా, ఇరాన్ విషయంలో ఏదైనా ప్రత్యేక వెసులుబాటు లభిస్తే.. ప్రాంతీయ శక్తి సమీకరణాలపై దాని ప్రభావం భారత్ లెక్కలను కూడా మార్చవచ్చు. అందుకే ఢిల్లీ తర్వాత వాషింగ్టన్‌లో జిన్‌పింగ్ భేటీపై భారత్ నిశితంగా గమనిస్తోంది. అమెరికా-చైనా సంబంధాలు పూర్తిగా తెగిపోవడం భారత్‌కు ఒక రకమైన అవకాశాలను తెస్తే.. ఇరుదేశాల మధ్య అవగాహన పెరగడం మరో రకమైన అవకాశాలను, సవాళ్లను తీసుకురావచ్చు.

## జైశంకర్ మళ్లీ వేసేశాడు.. పాక్ జర్నలిస్ట్‌కు ఘాటు కౌంటర్!

**ముద్ర, న్యూఢిల్లీ :** భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పటికే వెస్ట్రన్ మీడియాకు చాలా బాగా తెలుసు. ఆయనను ప్రశ్నలు అడిగి తన్నించుకోవడం ఎందుకు అని ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చింది. అలాంటిది పాకిస్తాన్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు జైశంకర్ ఘాటు కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సమావేశం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో పాకస్తాన్ జర్నలిస్ట్ అకస్మాత్తుగా లేచి..'' భారత్ పాకిస్తాన్‌లో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఎప్పుడు ఆపుతుంది? పాకిస్తాన్‌లో పరోక్ష ఉగ్రవాదానికి మీ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ఎప్పుడు ఆపుతుందో చెప్పగలరా?'' అని ప్రశ్నించారు.దీనికి జైశంకర్ తనదైన స్టైల్‌లో స్పందిస్తూ.. ''ఒక ఉగ్రవాద దేశం నన్నే ఈ ప్రశ్న అడుగుతోంది'' అని సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. గతంలో చాలాసార్లు ఉక్రెయిన్ యుద్ధం, భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయడంపై వెస్ట్రన్ మీడియా జర్నలిస్టులు జైశంకర్‌ను ప్రశ్నించిన క్రమంలో ఇలాంటి సమాధానాలతో జైశంకర్ వారి నోర్లు మూయించారు.



## నేరేడు గింజలు జీర్ణక్రియకు ఉపయోగపడుతాయా?

నేరేడు గింజల పొడిని సంప్రదాయ వైద్యంలో జీర్ణ సమస్యలకు ఉపయోగిస్తారు. మజ్జిగ వంటి ఆహారాల్లో కలిపి తీసుకునే పద్ధతులు ఉన్నప్పటికీ, అల్సర్‌కు చికిత్సగా దీనిపై ఆధారపడకూడదు.



## పెన్షన్‌కు లంచం డిమాండ్

### ముగ్గురు ఉద్యోగులపై వేటు



**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబరు 25:** పెన్షన్ ఫైలు ముందుకు కదలాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటూ విశ్రాంత ఉద్యోగినిని వేధించిన ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఎస్సీ అభివృద్ధి శాఖలో పనిచేసి మార్చిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగిణి పెన్షన్ ప్రతిపాదనలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించగా సీనియర్ అసిస్టెంట్ జి.రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, అటెండర్ బి.రాము లంచం డిమాండ్ చేసినట్లు, విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలింది. దీంతో ముగ్గురినీ సస్పెండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీనియర్ అధికారిణిపై కూడా సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించారు.ప్రజలను, విశ్రాంత ఉద్యోగులను లంచాల కోసం కార్యాలయాల చుట్టూ తిప్పితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని, కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలి



**ముద్ర, వలిగొండ:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం వలిగొండలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటర్ల జాబితా, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు తదితర అంశాలపై పారదర్శకత పాటించాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడేందుకు నియామక విధానంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 27న చలో యాదగిరిగుట్ట

### ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య



**ముద్ర, వలిగొండ:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య పిలుపునిచ్చారు. ఈనెల 27న యాదగిరి గుట్టలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు హాజరవుతారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తొమ్మిదేళ్లుగా ఫోరం పోరాడుతోందని పేర్కొన్నారు.

## అమ్మవారికి సహస్ర కుంకుమార్చన

స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. శ్రీస్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



## చదువులతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ముద్ర, దేవరకొండ:** విద్యతో ప్రపంచాన్ని జయించవచ్చని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్లు విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండలం దంజిలాల్ తండా బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు.వంటగది, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కూరగాయలు, నూనె, పండ్లు, గుడ్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకోగా వాష్‌రూమ్‌లు, కాంపౌండ్ వాల్, బోరు అవసరముందని తెలిపారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూచించినట్లు విద్యార్థులు తరగతి గదిలోనే భవిష్యత్తుకు పునాది వేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

### ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి గ్రామ వనరుల మ్యాప్ ద్వారా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణభివృద్ధి ఆధ్వర్యంలో వీజీపీపీ గ్రామ సభల ద్వారా వీబీగ్రామ్ జి పనుల గుర్తింపు పై జిల్లాలోని మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ గ్రామాల అభివృద్ధి ప్లాన్ తయారీ అమలు పై అవగాహన కార్యక్రమం లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, మానవ వనరులను గుర్తించి, వాటి ఆధారంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా వీబీజీ–రామ్ పథకం కింద 375 పనులకు 125 రోజుల పనులను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రణాళికలను ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం పనులను అమలు చేయాలన్నారు.ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్‌లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచిం చారు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, నీటి సంరక్షణకు సంబంధించిన పనులను వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికలో ఎక్కువగా గుర్తించి అమలు చేయాలని తెలిపారు. ఫామ్ పాండ్, ఇంకుడు గుంతలు తీయాలన్నారు.ఉపాధి హామీ పథకంలో సాధారణంగా చేపట్టే పనులు స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించడంతో పాటు, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికను పంచాయతీ స్థాయిలో సాంకేతికంగా, సమగ్రంగా రూపొందించి, గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికపై చేపట్టె వివిధ పనులపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారుఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ పిఎంఓ సరిత, జెడ్పీ సీ ఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఆడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, డిప్యూటీ సి ఈ ఓ శ్రీనివాస్, ఏ పి డి నవీన్, జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, జిల్లా స్థాయి అధికారులు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## లహరి హోమ్స్ ఔట్ లెట్ సమస్యకు పరిష్కారం చూపుతాం

### పీయేసీ ఛైర్మెన్ అరికపూడి గాంధీ



**ముద్ర, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లోని లహరి హోమ్స్ కాలనీ లో నెలకొన్న ఔట్ లెట్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై సీయంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మసీదు బండ లోని లహరి హోమ్స్ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, పనులు త్వరలోనే చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్ గాంధీ తెలియచేశారు. వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపుకు గురి అవుతుంది అని ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలుంను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు సూచన చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని,లహరి హోమ్స్ కాలనీ లో ప్రశాంత వాతావరణం తీసుకువస్తామని చైర్మన్ గాంధీ తెలియచేశారు. వరద నీటి ఔట్ లెట్ వలన మళ్ళీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల పై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ ఆనంద్, ఏఈ రషీద్, మాజీ కౌన్సిలర్ రామస్వామి యాదవ్, నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, కోడిచెర్ల రాములు, పవన్ కాలనీ వాసులు పాల్గొన్నారు

## కట్టెల మండీలను నగరం బయటకు తరలించాలి

### అఖిలపక్షం డిమాండ్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 25 :** జనావాసాల మధ్య ఉన్న కట్టెల మండీలు, టింబర్ డిపోలను నగరం బయటకు తరలించాలని, ఇండ్ల కూల్చివేతలను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వెంకట సాయి ఫంక్షన్ హాలులో భూక్య శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం నాయకుడు బండారు రమేష్ ప్రవేశపెట్టిన తీర్మానానికి కాంగ్రెస్, బిఆర్ఎస్ సహా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ టింబర్ డిపోల నుంచి వచ్చే ధూళి కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాసనగర్‌లోని 500 పేద కుటుంబాల ఇండ్లను కూల్చకుండా హైకోర్టు ద్వారా స్టే తెచ్చామని, బాధితులకు సిపిఐఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని కట్టెల మండీలకు ప్రత్యామ్నాయ స్థలం చూపించి నగరం వెలుపలకు తరలించాలని, నిరుపేదల ఇండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు దొడ్డా నగేష్, బిఆర్ఎస్ నాయకుడు పాలడుగు పాపరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కుక్కల, కోతుల బెడద తీర్చాలని వినతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలో పలు వార్డులలో కుక్కలు, కోతులు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాటి బెడద తీర్చాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ డీఈ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో పందుల సంచారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గతంలో బిఆర్ఎస్ పార్టీ తరుపున ధర్నాలు చేయగానే మున్సిపల్ అధికారులు నామమాత్రంగా కొన్ని పట్టి మిగిలినవి వదిలేయడం జరిగిందన్నారు. 2,3 రోజులలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 35 వార్డులలో ఉన్న కుక్కలు, కోతులు, పందులను పట్టి భువనగిరి పట్టణ ప్రజలను కాపాడాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఏవి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎనబోయిన జాంగిర్, చాగంటి నరసింహ, వెంకటేష్, బిక్షపతి పాల్గొన్నారు.



## కార్మికులకు అండగా నిరంతరం పోరాటం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు బందరపు వెంకటేశం అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూకార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమాన్ని కాపాడేందుకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, కోశాధికారి సామల శోభన్ బాబు, నాయకులు తిరుమలేష్, శ్రీనివాస్, పిన్నం జగన్, లింగాల నరసింహ, పర్వతాలు, రాములు, అశోక్, రమేష్, రవి, కృష్ణ, వెంకటేష్, లింగం పాల్గొన్నారు.




## గురుకులాల్లో భద్రత ఎక్కడ?

### ఎలుకల దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**ముద్ర, జనగామ:** పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిద్రిస్తున్న 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచి గాయపరిచిన ఘటనపై జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుంద్ర కుమారస్వామి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థినులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, వారి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ ఆధ్వర్యంలోని నివాస గురుకులాల్లో విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు యాజమాన్యం, సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. నిద్రిస్తున్న బాలికలను ఎలుకలు కరిచే స్థాయికి పరిస్థితులు ఎలా చేరుకున్నాయి? ముందస్తు నియంత్రణ చర్యలు ఎందుకు చేపట్టలేదు? ఘటన అనంతరం తల్లిదండ్రులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.ఈ ఘటనను కేవలం పారిశుద్ధ్య సమస్యగా కాకుండా విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవన హక్కులకు సంబంధించిన అంశంగా పరిగణించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా భద్రతా ఆడిట్గురుకులాలు, వసతి గృహాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కుమారస్వామి కోరారు. పాలకుర్తి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, విధుల్లో నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం నిర్ధారణైతే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో భద్రత, పారిశుద్ధ్యం, ఆహార నిల్వలు, ఎలుకలు–కీటకాల నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక కమిటీతో సమగ్ర తనిఖీలు నిర్వహించి భద్రతా ఆడిట్ చేపట్టాలని సూచించారు. ఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు పర్యవేక్షణ, నిరంతర తనిఖీలు, బాధ్యత నిర్ధారణతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

## వరద నీటిని చెరువులకు మళ్లించాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 25:** పాలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని వృథా కాకుండా జిల్లాలోని చెరువులకు మళ్లించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. పాలేరు రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన నీటిమట్టం, కాలువల ప్రవాహాన్ని పరిశీలించారు. అల్పపీడనం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సాగర్ ఎడమ కాలువ, పాతకాలువ, ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులను నింపేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని సూచించారు.



## జ్ఞానేష్ కుమార్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 25:** ఎన్నికల కమిషన్‌ను బీజేపీకి అనుకూలంగా మార్చారని ఆరోపిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లను తొలగించేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని 2024 నుంచి జరిగిన ఎన్నికలను రద్దు చేసి, పాత ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. పెన్షన్ల పెంపు, విద్యుత్ కోతల నివారణ, వ్యవసాయ మోటార్లకు మీటర్ల రద్దు, తుఫాను నష్టాలకు ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై అక్టోబర్ 5, 6 తేదీల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.




## జ్ఞానేశ్వర్ ప్రజాస్వామ్య ద్రోహి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 25:** కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులు జ్ఞానేశ్వర్ మిశ్రా ప్రజాస్వామ్య ద్రోహి అని, ఆయనను బాధ్యతల నుంచి తప్పించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు.బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఈవీఎంల ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. ఈవీఎంలపై వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపుతూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 26.09.2026
www.mudranews.in | @mudranews



## షుగర్ కంట్రోల్‌కు నేరేడు గింజలు?



నేరేడు పండ్ల గింజలను ఎండబెట్టి పొడిగా చేసుకుని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు కొంతమేర సహాయపడుతుందని ఆయుర్వేదంలో చెబుతారు. అయితే ఇది డయాబెటిస్ మందులకు ప్రత్యామ్నాయం కాదు.

# ఘనంగా గణనాథుని నిమజ్జనం











### చైర్ పర్సన్ రాధిక ఆధ్వర్యంలో స్వాగతం, పూజలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో గణేశ్ నిమజ్జనం శోభాయాత్ర కోలాహలంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి గణనాథులు ప్రధాన వీధుల్లోకి చేరుకుంటుండగా భక్తుల సందడి నెలకొంది. తీన్మార్ డ్యాన్సులు, డీజేల మధ్య యువత ఉత్సాహంగా శోభాయాత్రల్లో పాల్గొన్నారు.సూర్య గణేష్ మండపం వద్ద సామూహిక హారతి ఆకట్టుకుంది. రాందాస్(శివాజీ) చౌరస్తా వద్ద మెదక్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. చైర్‌పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ పూజలు నిర్వహించి వినాయక మండపాల నిర్వాహకులకు మెమెంటోలు అందజేశారు.కౌన్సిలర్లు హరిత, తొడుపునూరు రాము, పూసల శృతి సంతోష్, బుజరంపేట అరుణ సిద్దిరాములు, చెదల సంధ్య, పల్లె రాణి, రాగి వనజ, గౌస్, ఎరుకల నర్సింలు, మాజీ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ అశోక్, కమీషనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు. వినాయకుల శోభాయాత్ర చమన్, రాందాస్ చౌరస్తా, జెన్రోడ్, ప్రధాన రహదారి, మున్సిపాలిటీ, ఆటోనగర్, పిల్లికోటాల్, రాజ్‌పల్లి, కోంటూరు చెరువు వరకు మీదుగా సాగింది. గణనాథులను భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జనం చేశారు. భారీ క్రెన్ లు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ళను సిద్ధంగా ఉంచారు. రాందాస్ చౌరస్తా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. గణపతి చేతిలో పూజలు అందుకున్న లడ్డూలు, నోట్ల దండలను వేలం పాటలో పోటీ పడి దక్కించుకున్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ప్రత్యక్ష పర్యవేక్షణలో డిఎస్పీలు ప్రసన్న కుమార్, అల్లం సుభాష్ చంద్రబోస్, ఇన్స్పెక్టర్ మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోంటూర్ చెరువు వద్దకు చేరుకుని వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువులో బోటులో తిరిగారు.





# ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా?

### కేంద్ర ప్రభుత్వ పథకాలు, కొబ్బరికాయలు వారు కొడతామంటే ఎలా..?

### అధికారులను నిలదీసిన ఎంపీ రఘునందన్ రావు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** కేంద్ర ప్రభుత్వం ద్వారా పథకాలు మంజూరు అయితే.... స్థానిక ఎంపీకి కనీస సమాచారం ఇవ్వకరు.... అధికారులు లేదా కొబ్బరి కాయలు వారు కొడతామంటే ఎలా అని ? ఎంపీ ఎం. రఘునందన్ రావు జిల్లా అధికారులను నిలదీశారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్లో దిశా సమావేశం నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ... అధికారులు ఇదేవిధంగా వ్యవహరిస్తే ఢిల్లీ చూస్తారా అని చురకలంటించారు. ప్రతిసారి ప్రోటోకాల్ విషయంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్లో అమృత్ పథకంలో 12 కోట్లతో ట్యాంకుల నిర్మాణం చేసి కనీస సమాచారం ఇవ్వరా అని మున్సిపల్ కమిషనర్ను ప్రశ్నించారు. అంతకుముందు ఆసుపత్రి సూపరెంటెంట్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఇతర అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలపై అవగాహన లేకపోవడం, కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలిమెదక్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు వాటి ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ రఘునందన్ రావు ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా మరియు శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల కింద జిల్లాకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎంపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు తదితర సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎంపీ సూచించారు.రామ్ జీబివి పథకం ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడా లని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో పథకాలు ప్రజలకు అందేలా చూడలన్నారు. ఎంపీ రఘునందన్ రావు సూచించిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, వచ్చే దిశ మీటింగ్ వరకు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, అధికారులు, దిశా కమిటీ సభ్యులు, నర్సాపూర్, తుప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్లు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందే కాంగ్రెస్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేశంలో రాజ్యాంగాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఎంపీ రఘునందన్ రావు ధ్వజమెత్తారు. ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వాలను 356 ఆర్టికల్ ద్వారా కూలగొట్టిన చరిత్ర వారిదేనని విమర్శించారు. ఎస్ఐఆర్ సరైనదేనని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే మూడు రాష్ట్రాలలో బిజెపి గెలవడం కరెక్ట్ కాదు, కానీ ఒక రాష్ట్రంలో కాంగ్రెస్, మరో రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ విజయం సాధిస్తే ఓకేనా అని ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. శుక్రవారం మెదక్లో మీడియాతో మాట్లాడారు. 1993 వరకు భారత ఎన్నికల సంఘానికి ఒకే కమీషనర్ ఉండగా టీఎన్. శేషన్ కు ఎడమ, కుడివైపున మరో ఇద్దరు కమిషనర్లను పెట్టిన ఘనత కాంగ్రెస్ దే అన్నారు. ప్రజల విశ్వాసం, ఓట్లు పొందలేక ప్రధాని మోడీ, ఎస్ఐఆర్ పై మాట్లాడుతున్నారని రఘునందన్ రావు ఖండించారు. కేరళ, తమిళనాడులో సైతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ఎన్నికలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిభ పాటిల్ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ముఖ్య ఎన్నికల అధికారి మరో ఎన్నికల అధికారిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తే కాంగ్రెస్ పార్టీ రిజెక్ట్ చేయించిందని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాళ్లాస్ రాధా మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, కౌన్సిలర్ రాజమణి, సర్పంచ్ వీణ తదితరులు ఉన్నారు.

## ఆదిలాబాద్‌లో వైద్య పరిస్థితులపై అధ్యయన కమిటీ

### పసి పిల్లలు, గర్భిణుల మరణాలు, వైద్య సదుపాయాలపై సమగ్ర అధ్యయనం

**ముద్ర, హైదరాబాద్:**



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీలో పసి పిల్లలు, గర్భిణుల మరణాలు, వైద్య సేవలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఏడుగురు సభ్యులతో అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.ఉట్నూర్ ఏజెన్సీలో గిరిజనులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది పరిస్థితి, మందుల లభ్యత తదితర అంశాలను కమిటీ పరిశీలించనుంది. ముఖ్యంగా నవజాత శిశువులు, గర్భిణుల మరణాలకు దారితీస్తున్న కారణాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడంతో పాటు, సమస్యలకు గల కారణాలను గుర్తించాలని కవిత సూచించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో అందుతున్న వైద్య, ఇతర సేవలు, వాటిలో ఉన్న లోటుపాట్లపైనా అధ్యయనం చేయాలని ఆదేశించారు.రిమ్స్ ఘటన నేపథ్యంలో కమిటీఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)లో ఏసీ పేలి ఐదుగురు నవజాత శిశువులు మృతి చెందిన ఘటనపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన అనంతరం రిమ్స్‌ను సందర్శించి ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను పరిశీలించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలిచారు.ఈ ఘటనలో చిన్నారుల మరణాలకు దారితీసిన పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడంతో పాటు రిమ్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య వసతులు, వైద్యులు, సిబ్బంది, పూర్తి స్థాయి వైద్య సేవలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రిమ్స్‌కే పరిమితం కాకుండా ఉట్నూర్ ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు ఏ స్థాయిలో అందుతున్నాయనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించనుంది.ఏడు మంది సభ్యులతో కమిటీకమిటీలో ఆర్వీఆర్ ప్రసాద్, ఇరిగిజ్జ మురళీకృష్ణ, ఎంఏ అశ్వక్, డాక్టర్ చంద్ర ప్రకాష్, డాక్టర్ సనీత్ కుమార్, పగిడాల శ్రావణి, హలీమా బేగం సభ్యులుగా ఉన్నారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను పరిశీలించడంతో పాటు వైద్యులు, సిబ్బంది, బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించనున్నారు.పసి పిల్లలు, గర్భిణుల మరణాలు, వైద్య సదుపాయాలు, రిమ్స్‌లోని పరిసితులు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, ఐటీడీఏ సేవలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కవిత ఆదేశించారు. అధ్యయనం అనంతరం నివేదికను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేసిన కమిటీతో పాటు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు.

## నేడు సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహారం పథకంలో భాగంగా మెదక్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఈనెల26న ఉదయం ప్రారంభించనున్నారు. రాష్ట్ర కార్మిక ఉపాధి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 11 మండలాల పరిధిలో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించనున్నారు.

## సామూహికంగా వందేమాతరం గీతాలాపన



**ముద్ర ప్రతినిధి, మెదక్:** విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నమామి భారతం పేరిట మెదక్ రాందాస్ చౌరస్తాలో వందేమాతరం సామూహిక గానం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కమీషనర్ నవీన్, కౌన్సిలర్లు హరిత, సంధ్య, కో ఆప్షన్ సభ్యులు రగు వనజ, శిశు మందిర్ అధ్యక్షులు గంజి శ్రీనివాస్, దత్తు, ఆచార్యులు,, విద్యార్థులు పాల్గొన్నారు.

## దీనదయాళ్ ఉపాధ్యాయకు దత్తాత్రేయ నివాళి

### రాజకీయాల్లో నైతిక విలువలు పాటించడమే నిజమైన నివాళి

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 25:**



అంత్యోదయ దివస్ సందర్భంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతిని పురస్కరించుకుని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయనకు ఘన నివాళులర్పించారు. హైదరాబాద్ రాంనగర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. భారతీయ జనసంఘ్, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీకి సైద్ధాంతిక భూమిక, వ్యవస్థను నిర్మించిన గొప్ప ప్రజాసేవకుడు, దేశభక్తుడు దీనదయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు. సరళమైన జీవనం, ఉన్నతమైన ఆలోచన అనే ఆయన సందేశాలు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు.పెట్టుబడిదారీ, సామ్యవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా ఏకాత్మ మానవతావాదాన్ని ప్రతిపాదించిన దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను గుర్తు చేశారు. ఆయనకు నిజమైన నివాళి అర్పించాలంటే రాజకీయాల్లో నైతిక విలువలు, నీతి, నిజాయితీ పాటించాలని దత్తాత్రేయ పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వికలాంగుల సెల్ కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, రాగిటి నరేష్, వంశీకృష్ణ, కిషోర్, ఓంప్రకాశ్, జగదీష్, సంగం బాలరాజ్, షిండే గణేష్, శేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555